తెలంగాణ పేపర్

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ సంపుటి: 13 సంచిక : 247 | సంపాదకులు : నస్రీన్ ఖాన్ | శుక్రవారం, జులై 24, 2026 | పేజీలు : 8 వెల : రూ. 2/-

మెట్టుగూడలో కాంగ్రెస్ ధర్నా

హైదరాబాద్: ఢిల్లీలో విద్యార్థుల పక్షాన పోరాడుతున్న కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీని బిజెపి ప్రభుత్వం అరెస్టు చేయడాన్నీ ఖండిస్తూ మెట్టుగూడలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర సికింద్రాబాద్ జిల్లా అధికార ప్రతినిధి కే.ఎస్ శిల్పాచారి ఆధ్వర్యంలో శ్లకార్డులు పట్టుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శిల్ప చారి మాట్లాడుతూ పేపర్ లీకులకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే ఆయన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీల వల్ల ఎన్నో కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారే పరిస్థితి ఏర్పడింది అన్నారు. పేపర్ లీకేజీలు అరికట్టకపోగా విద్యార్థులకు న్యాయం చేయాలని రాహుల్ గాంధీ నిరసనలో పాల్గొంటే పోలీసులు అన్యాయంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. బిజెపి పార్టీ అధికారంలోకి వచ్చిన అప్పటినుంచి ఇప్పటివరకు దాదాపు 152 పేపర్ లీకేజీలు అయ్యాయని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తప్పకుండా బిజెపి పార్టీకి తగిన గుణపాఠం చెప్పి కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తారని అన్నారు.

పేపర్‌లీక్‌పై విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు..
ఆందోళనల వేళ మోదీ బిగ్ మెసేజ్



నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ దిల్లీలోని జంతరమంతర్ వద్ద మొదలైన నిరసనలు దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ మొదలుపెట్టిన ఈ ఆందోళనలకు విపక్షాలు కూడా తోడయ్యాయి. ఈ లీక్ అంశంపైనే పార్లమెంట్‌లో వాయిదాలపర్వం కొనసాగుతోంది. ఈ పరిణామాల వేళ ప్రధాని నరేంద్రమోదీ గురువారం కీలక ప్రకటన చేశారు. పరీక్ష పత్రాల లీకేజీ బాధ్యులకు త్వరితగతిన కఠినశిక్ష పడేలా చూసేందుకు ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తుందని ప్రకటించారు.
యువత భవిష్యత్తుకు హాని చేయాలని చూసేవారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టబోమని, వారి సంక్షేమమే తమ ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని వెల్లడించారు. "విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు మా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇది కొనసాగింపు. పేపర్ లీక్ బాధ్యులకు శిక్ష పడేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఇందుకోసం అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటారు" అని ఎక్స్ వేదికగా మోదీ వెల్లడించారు.

మోదీ పోస్ట్‌కు రాహుల్ రియాక్షన్..

మోదీ ప్రకటనపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. "మన యువత భవిష్యత్తుకు హాని చేసింది మీరే. మన విద్యావ్యవస్థ నిర్వీర్యం అవుతుంటే చూసి, బాధ్యులైన వారిని రక్షించారు. ఇప్పుడు విద్యార్థులు డిమాండ్లు స్పష్టంగా ఉన్నాయి. 1. ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలి. 2. విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి. 3. యువతపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని రాహుల్ ఎక్స్ రాసుకొచ్చారు.

సీజేపీ ఏమందంటే..?

ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేస్తామంటూ ప్రధాని చేసిన ప్రకటనపై అటు సీజేపీ కూడా స్పందించింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌ను పునరుద్ఘాటించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది. ఇదిలా ఉండగా.. సీజేపీ ఆందోళనల దృష్ట్యా గురువారం కూడా దిల్లీలో 16 మెట్రో స్టేషన్లను అధికారులు మూసివేశారు.

ఎప్పుడైనా మీ ఇష్టమే.. చర్చలకు ప్రభుత్వం సిద్ధం: జితేంద్ర సింగ్



దిల్లీ: నీట్ పేపర్ లీకేజీపై ఆందోళనలు ఉద్ధృతమైన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు ముమ్మరం చేసింది. చర్చలకు రావాలని విద్యార్థులు, కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) నేతలను మరోసారి ఆహ్వానించింది. 'మీకు అనుకూలంగా ఉండే సమయంలో ఎప్పుడైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ పిలుపునిచ్చారు.

"ఆందోళనకారులకు కేంద్రం నాలుగు ప్రతిపాదనలు చేసింది. వాటిపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఆందోళనకారుల తరపున కొందరు వచ్చి ప్రభుత్వంతో చర్చించవచ్చు. మీరు ఎప్పుడైనా రావొచ్చు. ప్రభుత్వం తరపున నేను, జేపీ నడ్డా చర్చలో పాల్గొంటాం" అని జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. జేపీ నడ్డా కార్యాలయంలోగానీ, ఆయన నివాసంలో గానీ చర్చిద్దామన్నారు. తొలుత చర్చ ప్రారంభిస్తే.. క్రమంగా నమన్యకు వరిష్కారం లభిస్తుందన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

కన్నాట్ ప్లేస్‌లో 6:30కే దుకాణాలు బంద్

సీజేపీ ఆందోళనల నేపథ్యంలో న్యూదిల్లీ ట్రేడర్స్ అసోసియేషన్ (ఎన్‌డీటీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. ఆందోళనల తీవ్రత అధికంగా ఉన్న కన్నాట్ ప్లేస్ (సీపీ) ప్రాంతంలో గురువారం సాయంత్రం 6:30కే దుకాణాలు, కార్యాలయాలు మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. అందుకు యజమానులు సహకరించాలని కోరింది. ఎన్‌డీటీఏ ఆదేశాలను ఆమ్‌ఆద్మీపార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. సాయంత్రం 6:30 గంటలకే దుకాణాలు మూసేయమనడం, జంతర్‌మంతర్ వద్ద పోలీసులను మోహరించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై కేంద్రం మరోసారి బలప్రయోగం చేయాలని చూస్తోందని ఆరోపించారు.

ఓటరు సవరణ ప్రక్రియ పై మంత్రి పొన్నం సమీక్ష



హుస్నాబాద్: హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఓటరు సవరణ ప్రక్రియపై బిఎల్ఏ-2లు, బిఎల్ఏ సూపర్వైజర్లు, పార్టీ ముఖ్య నాయకులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్యూమరేషన్ ఫారాన్ని స్వయంగా పూర్తి చేసి బీఎల్వోకు అందజేశారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు తమ వివరాలను సరిచూసుకొని ఎన్యూమరేషన్ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొనాలని అన్నారు.
హుస్నాబాద్ పట్టణంలో ఇప్పటికే 80 శాతానికి పైగా ఓటరు సవరణ ప్రక్రియ పూర్తయింది. మిగిలిన ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేసి హుస్నాబాద్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ ఓటరు సవరణ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలి.ఆగస్టు 3వ తేదీ వాఖీ ప్రక్రియకు చివరి తేదీ కావడంతో, షిఫ్ట్ అయిన కుటుంబాల వివరాలను పూర్తిస్థాయిలో సేకరించి, వారు ప్రస్తుతం ఎక్కడ నివసిస్తున్నారో, ఏ ప్రాంతంలో ఓటు నమోదు చేసుకోవాలనుకుంటున్నారో తెలుసుకుని అవసరమైన సహకారం అందించాలని బిఎల్ఏలు, సూపర్వైజర్లకు సూచించారు. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా అత్యంత బాధ్యతతో పనిచేయాలి. ప్రతి వార్డు సభ్యుడు తమ వార్డులో ఎన్యూమరేషన్ పూర్తి కాని కుటుంబాలను గుర్తించి, బిఎల్ఏలతో సమన్వయం చేసుకుంటూ ఇంటింటికి వెళ్లి ప్రక్రియను పూర్తి చేయాలి అని అన్నారు.
ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు. ప్రతి అర్హత కలిగిన పౌరుడి ఓటు ఓటరు జాబితాలో ఉండేలా ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేయాలి అని దిశా నిర్దేశం చేయడం జరిగిందని అన్నారు.

శాసనసభలో మరమత్తు పనులు పరిశీలించిన సీఎం రేవంత్



హైదరాబాద్: చారిత్రక ప్రాధాన్యం కలిగిన తెలంగాణ శాసనసభ భవనంలో జరుగుతున్న మరమ్మతు, పునరుద్ధరణ పనులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పరిశీలించారు. ప్రాంగణమంతా తిరిగి పనుల పురోగతిపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని, పలు సూచనలు చేశారు.

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అద్దంకి దయాకర్ , బల్మూర్ వెంకట్ , ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ , జైవీర్ రెడ్డి , ఉన్నతాధికారులు హాజరయ్యారు.

రేవంత్ లీగల్ నోటీసులు...



హైదరాబాద్, జూలై 23: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై చేసిన ఆరోపణలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు తన లీగల్ టీమ్ త్వరలోనే ముఖ్యమంత్రికి నోటీసు పంపనుందని వెల్లడించారు.కొడంగల్‌లో జరిగిన సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు స్పందిస్తూ కేటీఆర్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. గ్లోబరీనా సంస్థతో బీఆర్ఎస్‌కు గానీ, తన కుటుంబానికి గానీ, తనకు గానీ ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. పేపర్ లీక్‌లాంటి సున్నితమైన అంశంపై ముఖ్యమంత్రి బాధ్యతారాహిత్యంగా తప్పుడు ఆరోపణలు చేయడం దురదృష్టకరమని విమర్శించారు.ముఖ్యమంత్రి హోదాలో ఉండి చౌకబారు రాజకీయాల కోసం అసత్యాలను ప్రచారం చేయడం తగదన్నారు. కనీసం ఒక్కసారైనా ముఖ్యమంత్రిలా వ్యవహరించాలని రేవంత్ రెడ్డికి సూచించారు.తనపై తరచూ అసభ్యకరమైన, అర్థంలేని ఆరోపణలు చేసినప్పటికీ ప్రతి సందర్భంలో స్పందించలేదని కేటీఆర్ పేర్కొన్నారు. తాను మౌనంగా ఉండడాన్ని ఆరోపణలను అంగీకరించినట్లు భావించవద్దన్నారు. "బురదలో కుస్తీ పట్టడం నాకు ఇష్టం ఉండదు. అందుకే చాలా సందర్భాల్లో స్పందించను" అని వ్యాఖ్యానించారు.

నిరసనకు మద్దతు

ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలను నిరసిస్తూ శుక్రవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్వీ నిరసన చేపట్టనుంది. దీంట్లో తాను స్వయంగా పాల్గొంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును అణచివేయలేరని అన్నారు.ఈ మేరకు గురువారం ఎక్స్‌లో పోస్టు చేసిన కేటీఆర్.. ఉదయం 10 గంటలకు ఇందిరాపార్క్‌లో జరిగే బీఆర్ఎస్వీ ఆందోళనలో పాల్గొంటానని తెలిపారు. ఢిల్లీలో విద్యార్థులు, యువతపై జరిగిన పోలీసు చర్యలకు నిరసనగా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నానని పేర్కొన్నారు.దేశ యువత గొంతును బలవంతంగా అణచివేయడం సాధ్యం కాదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే విద్యార్థులు, యువతతో పాటు ప్రతి ఒక్కరూ ఈ నిరసనలో పాల్గొని మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.నీట్ పేపర్ లీక్, పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఐక్యవేదిక శుక్రవారం తెలంగాణవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

సీసీఐ వైఖరి చెప్పండి

అదిలాబాద్ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ప్లాంట్ పునరుద్ధరణపై తెలంగాణ ప్రభుత్వం తన అధికారిక వైఖరిని తక్షణమే స్పష్టం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి ఆయన బుధవారం ఒక బహిరంగ లేఖ రాశారు. ఆదిలాబాద్ జిల్లా పారిశ్రామిక భవిష్యత్తుకు, వేలాది కుటుంబాల ఉపాధికి కీలకమైన ఈ ప్లాంట్‌ను పునఃప్రారంభించే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదని ఆయన ఆరోపించారు.జులై 15న బీఆర్ఎస్ ప్రతినిధి బృందం, సీసీఐ సాధన సమితి సభ్యులతో కలిసి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కలిసిన విషయాన్ని కేటీఆర్ తన లేఖలో గుర్తుచేశారు. ప్లాంట్ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం రూ. 250 కోట్లు కేటాయించి, అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తేనే ఇది సాధ్యమవుతుందని కేంద్ర మంత్రి స్పష్టం చేసినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రతిపాదన లేకపోవడమే పునరుద్ధరణకు ప్రధాన అడ్డంకిగా మారిందని ఆయన తెలిపారు.ఎన్నికల సమయంలో ఆదిలాబాద్‌లో సీసీఐని తెరిపిస్తామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదని కేటీఆర్ విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సహా తాను కేంద్రానికి పలుమార్లు లేఖలు రాసినట్లు గుర్తుచేశారు. టీఎస్-ఐపాస్ ద్వారా ప్రోత్సాహకాలు, కేంద్ర-రాష్ట్ర భాగస్వామ్యంతో జాయింట్ వెంచర్ లేదా పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే ప్లాంట్‌ను నడిపేందుకు సిద్ధమని ప్రతిపాదించినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో, సీసీఐ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి, తన వైఖరిని ప్రజలకు వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

కొత్త పేర్లతో దేశ వ్యతిరేక వేదికలను ఏర్పాటు
యూపీఏ హయాంలోనే అత్యధిక జాతీయ పరీక్షల పేపర్లు లీక్ - బీజేపీ రామచంద్రరావు



హైదరాబాద్: దేశంలో అలజడులు సృష్టించి మోదీ ప్రభుత్వాన్ని బలహీనపర్చేందుకు కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు, విదేశీ విచ్ఛిన్నకర శక్తులు కుట్ర చేస్తున్నాయి. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ తరహా పరిస్థితులు భారత్లో సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు అన్నారు.

గురువారం అయన మీడియాతో మాట్లాడారు.

రామచంద్రరావు మాట్లాడుతూ ఎస్ఎఫ్ ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఎస్ఏ నేతలు కొత్త పేర్లతో దేశ వ్యతిరేక వేదికలను ఏర్పాటు చేస్తున్నారు. పూణే, ముంబై, హైదరాబాద్, ఢిల్లీలో జరిగిన కార్యక్రమాల వెనుక విదేశీ శక్తుల హస్తం ఉంది. ఖలిస్తానీ, కతార్, కెనడా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి ఈ ఉద్యమాలకు మద్దతు అందుతున్నట్లు ఆధారాలు బయటకు వస్తున్నాయి. ఇందిరా గాంధీ హత్యకు కారణమైన ఖలిస్తానీ శక్తులతో రాహుల్ గాంధీ జతకట్టడం సిగ్గుచేటని అన్నారు.

నీట్ లీక్ వెలుగులోకి రాగానే మోదీ ప్రభుత్వం వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకుంది. లీక్ కేసులో 31 మందిని అరెస్ట్ చేసి నిందితులపై చర్యలు చేపట్టింది. విద్యార్థులకు అన్యాయం జరగకుండా అవసరమైన చోట రీ-ఎగ్జామ్స్ నిర్వహించింది. పరీక్షల్లో అక్రమాలను అరికట్టేందుకు మోదీ ప్రభుత్వం 2024లో కఠిన చట్టాన్ని తీసుకొచ్చింది.ఎన్ టీ యే లో సంస్కరణల ద్వారా పరీక్షల వ్యవస్థను మరింత బలోపేతం చేసింది.2014కు ముందు యూపీఏ హయాంలోనే అత్యధిక జాతీయ పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయి. అప్పట్లో ఒక్క విద్యాశాఖ మంత్రి కూడా నైతిక బాధ్యత తీసుకుని రాజీనామా చేయలేదు. కాంగ్రెస్ ఇప్పుడు రాజీనామాలు డిమాండ్ చేయడం రాజకీయ ద్వంద్వ వైఖరి. యూపీఏ పదేళ్లలో 2.9 కోట్ల ఉద్యోగాలు మాత్రమే వస్తే, మోదీ ప్రభుత్వం పదేళ్లలో 17 కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పించింది. మోదీ ప్రభుత్వం ఇప్పటివరకు 12 లక్షలకు పైగా నియామక పత్రాలు అందించింది. రోజ్గార్ మేళాల ద్వారా నిరంతరం ఉద్యోగ నియామకాలు కొనసాగుతున్నాయి. దేశంలో నిరుద్యోగిత రేటు గణనీయంగా తగ్గింది. ఐఐటీలు, ఐఐఎంలు, ఏయిమ్స్ లు, నిట్ లు, మెడికల్ కళాశాలల సంఖ్యను మోదీ ప్రభుత్వం భారీగా పెంచింది.

తెలంగాణ పవర్

సంపాదకీయం

శుక్రవారం, జులై 24, 2026

బీజేపీ గేమ్ లో సీజేపీ

ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ నివాసం వెలుపల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన ధర్నా, ఆందోళన సందర్భంగా ఆయన గాయపడటం జాతీయ రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ ఘటన దేశవ్యాప్తంగా మీడియా దృష్టిని ఆకర్షించడమే కాకుండా, అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర స్థాయి వాగ్వాదానికి కారణమైంది. అయితే,పైకి కనిపించే ఈ రాజకీయ నిరసన వెనుక అత్యంత సంక్లిష్టమైన వ్యూహాత్మక రాజకీయ కోణం ఉందనే చర్చ ఇప్పుడు రాజకీయ పరిశీలకుల్లో జోరుగా సాగుతోంది.ప్రస్తుతం దేశంలో తీవ్రరూపం దాల్చుతున్న సిజెపి ఆందోళనలు, కాక్రోచ్‌ల ఉద్యమం వంటి తీవ్రమైన ప్రజా ఆగ్రహ ఉద్వేగాలను పక్కదారి పట్టించడానికి లేదా వాటి ఉధృతిని తగ్గించడానికి ఈ ధర్నా ఒక సేఫ్టీ వాల్వ్‌లా ఉపయోగపడిందనే వాదన ప్రధానంగా వినిపిస్తోంది. ప్రజా సమస్యలపై జరుగుతున్న ఈ ఉగ్ర పోరాటాల తీవ్రతను కప్పిపుచ్చేందుకు, ప్రజల మరియు మీడియా దృష్టిని పూర్తిగా రాహుల్ గాంధీ చేపట్టిన నిరసన వైపు మళ్లించేందుకు ఇదొక చక్కటి వ్యూహంగా అమలు చేశారని భావిస్తున్నారు. తీవ్రమైన ప్రజా వ్యతిరేకతను డైవర్ట్ చేసేందుకు ఇలాంటి నాటకీయ పరిణామాలు దోహదపడతాయని భావిస్తున్నారు. ఈ పరిణామం ద్వారా అధికార పక్షానికి ఒక రకమైన వ్యూహాత్మక ప్రయోజనం చేకూరినట్లు కనిపిస్తోంది. సున్నితమైన ఉద్యమాల నుంచి దృష్టిని వేరే వైపు మళ్లించేందుకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ ధర్నా ఒక కంట్రోల్డ్ ఆపోజిషన్ వ్యూహంలో భాగమనే అనుమానాలు బలపడుతున్నాయి. రాహుల్ గాంధీకి తగినంత స్పేస్ ఇవ్వడం ద్వారా అసలు సమస్యల మూలాలను తెరవెనుకకు నెట్టి, కేవలం వ్యక్తిగత లేదా పార్టీ కేంద్రీకృత అంశాలపై చర్చ జరిగేలా చూడటంలో బీజేపీ వ్యూహం సఫలమైందనే చెప్పాలి.రాహుల్ గాంధీకి ఈ స్థాయిలో నిరసన తెలిపేందుకు, మీడియాలో భారీ స్పేస్ ఆక్రమించేందుకు అధికార బీజేపీయే వ్యూహాత్మకంగా అవకాశం కల్పించిందనే అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. రాజకీయాల్లో ఏదీ యాదృచ్ఛికంగా జరగదనే నానుడికి తగినట్లుగా, కాంగ్రెస్ అగ్రనేతను ఒక పావులా వాడుకుని పెద్ద ఎత్తున ప్రజా దృష్టిని వేరే అంశాల వైపు మళ్లించే ప్రయత్నం జరిగిందన్న భావన వ్యక్తమవుతోంది. రాహుల్ గాంధీ నేతృత్వంలోని ఈ హై-వోల్టేజ్ ఆందోళనను అధికార పక్షం తమకు అనుకూలమైన ఒక వ్యూహాత్మక ఆయుధంగా మలచుకుందనే అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో బలపడుతున్నాయి మీడియా దృష్టిని పూర్తిగా మోదీ నివాస ఆందోళన , రాహుల్ గాంధీ గాయం చుట్టూ కేంద్రీకరించడం ద్వారా, దేశవ్యాప్తంగా ఊపందుకుంటున్న ఇతర ప్రజా ఉద్యమాల వేగం ఆకస్మికంగా నెమ్మదించింది. మీడియాలో ప్రధాన హెడ్‌లైన్స్ అన్నీ రాహుల్ ధర్నా గురించే రావడంతో, కాక్రోచ్‌ల ఉద్యమం, సిజెపి ఆందోళనల తీవ్రత కొంతమేర కిందికి దిగివచ్చింది. ఇది అధికార పార్టీకి వ్యూహాత్మకంగా అతిపెద్ద ఊరటనిచ్చే అంశంగా రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఈ మొత్తం వ్యూహంలో కాంగ్రెస్ పార్టీ తాము ఒక పెద్ద పోరాటం చేశామని భావిస్తున్నప్పటికీ, వాస్తవానికి అది అధికార పార్టీ వ్యూహంలో భాగస్వామ్యం కావడమేనని విమర్శకులు ఎత్తిచూపుతున్నారు. బీజేపీ సర్కార్‌ను ఇరుకున పెట్టాలని భావించిన రాహుల్ గాంధీకి స్పేస్ దక్కినప్పటికీ, దానివల్ల అసలు ప్రజా సమస్యల తీవ్రత నీరుగారిపో యింది. ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాల నుంచి దృష్టిని మళ్లించే డెకాయ్ రాజకీయాలకు కాంగ్రెస్ మరోసారి బలయ్యిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి .ప్రధాని నివాసం వెలుపల రాహుల్ గాంధీ చేసిన ధర్నా , ఆ సందర్భంగా జరిగిన పరిణామాలు కేవలం ఒక సాధారణ నిరసన ప్రదర్శన మాత్రమే కాదని, ఇదొక పెద్ద రాజకీయ మైండ్ గేమ్‌గా స్పష్టమవుతోంది. తీవ్రమైన ప్రజా ఉద్యమాలను నీరుగార్చేందుకు అధికార పక్షం అందించిన సేఫ్టీ వాల్వ్ స్పేస్‌ను కాంగ్రెస్ వాడుకోవడం ద్వారా, తాత్కాలిక రాజకీయ లబ్ధి పొంది నట్లు కనిపించినా దీర్ఘకాలికంగా మాత్రం క్షేత్రస్థాయి ఉద్యమాల తీవ్రత దెబ్బతిన్నదనేది ఎక్కువ మంది భావన.

- ఎడిటర్

బెంగాల్ లో ఊపిరిపోసుకుంటున్న లెఫ్ట్ పార్టీలు

కోల్ కత్తా, జూలై 23, (న్యూస్ పల్స్)పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఒకప్పుడు తిరుగులేని శక్తిగా వెలిగిన తృణమూల్ కాంగ్రెస్ నేడు తీవ్ర అంతర్గత సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన రాజకీయ వారసుడిగా మేనల్లుడు అభిషేక్ బెనర్జీని నిలబెట్టేందుకు పడుతున్న ఆరాటం, సీనియర్ నేతల్లో తీవ్ర తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. అధికారం పోవడంతో పార్టీ ముఖ్యనేతలందా గుడ్ బై చెప్పేశారు. ప్రతిపక్ష రాజకీయ శూన్యత స్పష్టంగా కనిపిస్తోంది. ఇది సీపీఎంకు ఓ మంచి అవకాశంగా కనిపిస్తోంది. ఈ రాజకీయ పరిణామం సుదీర్ఘకాలం 34 ఏళ్లు రాష్ట్రాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలిన మార్క్సిస్ట్ కమ్యూనిస్ట్ పార్టీ అఖఎ-ఓ కి, లెఫ్ట్ ఫ్రంట్‌కు చారిత్రాత్మక అవకాశాన్ని తలుపు తడుతోంది. 2011లో మమతా తుఫాన్‌లో అధికారం కోల్పోయిన తర్వాత, సురక్షిత స్థావరం కోసం సీపీఎం కేడర్ పెద్ద ఎత్తున బిజెపి, టిఎంసి వైపు వలస వెళ్లారు. అయితే, గ్రామీణ బెంగాల్‌లో సీపీఎం నిశ్శబ్ద మూలాలు, సైద్ధాంతిక బలగాలు నేటికీ చెక్కుచెదరలేదు. తమ ఉనికిని కాపాడుకోవడానికి తాత్కాలికంగా ఇతర జెండాలు పట్టిన శ్రేణులు, ఇప్పుడు బీజేపీ అధికారంలోకి రావడం, మమతా పార్టీ నిర్వీర్యం అవుతున్న సూచనలు కనిపిస్తూండటం?తమళ్లీ ఎర్రజెండా వైపు చూస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ లెఫ్ట్ నేతలు పాత పద్ధతులను విడనాడి, కొత్త వ్యూహాలతో శ్రేణులను జాగృతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. మీనాక్షి ముఖర్జీ వంటి అత్యంత ప్రజాదరణ పొందిన యువనాయకులను ముందుంచి, కార్మికులు-రైతులు-యువత అజెండాతో బెంగాల్‌ను కాపాడుకుందాం పేరిట విస్తృత పాదయాత్రలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. మత-కులాతీత రాజకీయాల ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ముఖ్యంగా యువతను ఆకట్టుకోవడానికి డిజిటల్ మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా సీపీఎం విస్తృత ప్రచారం నిర్వహిస్తోందిఅయితే, సైద్ధాంతికంగా సానుకూల వాతావరణం ఉన్నప్పటికీ, ఆచరణలో సీపీఎం ముందు కొండంత సవాళ్లు నిలిచాయి. దశాబ్దకాలంగా అమానుష దాడులకు గురై దెబ్బతిన్న గ్రామస్థాయి కార్యకర్తలకు మాస్ ప్రొటెక్షన్ కల్పించడంలో పార్టీ అగ్రనాయకత్వం ఇంకా సంపూర్ణ విశ్వాసాన్ని నింపలేకపోతోంది. పైగా, కాంగ్రెస్ పార్టీతో చేసుకుంటున్న తాత్కాలిక పొత్తులు క్షేత్రస్థాయిలో ఓటర్లలో కొంత అయోమయాన్ని సృష్టిస్తున్నాయి. తమ పూర్వపు ఓటు బ్యాంకును ఆకర్షించడంలో లెఫ్ట్ ఫ్రంట్ వేస్తున్న అడుగులు ఆశాజనకంగా ఉన్నప్పటికీ ఇంకా చాలా పోరాటం చేయాల్సిఉంది. తృణమూల్ ఎంత బలహీనపడితే సీపీఎంకు అంత మేలు జరుగుతుంది.పశ్చిమ బెంగాల్‌లో స్థానిక సమస్యలపై పోరాడే అసలైన ప్రతిపక్షంగా అవతరించే అర్హత, సైద్ధాంతిక పునాది సీపీఎంకి మాత్రమే ఉన్నాయి. బీజేపీ వైపు వెళ్లిన తమ పాత ఓటర్లను ఇంటికి రప్పించడంలోనూ, యువతలో ఉపాధి రాజకీయాల పట్ల నమ్మకం కలిగించడంలోనూ సీపీఎం నేతలు ఎంతవరకు సఫలమవుతారో అనే దానిపైనే బెంగాల్‌లో ఎర్ర సూర్యుడి పునరాగమనం ఆధారపడి ఉంటుంది.

హ్యాట్రిక్ కోసం యోగీ వ్యూహాలు



లక్నో జూలై 23, (న్యూస్ పల్స్) ఉత్తరప్రదేశ్‌లో అధికారం చేజిక్కించుకోవడం దేశవ్యాప్తంగా పాలనా అధికారం కోసం పోటీపడే ఏ పార్టీకైనా అత్యంత కీలకమైన మెట్టు. ఈ రాష్ట్రం 80 లోక్‌సభ స్థానాలతో దేశంలోనే అత్యధిక ప్రాతినిధ్యం కలిగి ఉంది. పశ్చిమ భారతదేశం మొత్తం కలిపినా ఇంతకంటే తక్కువ స్థానాలు ఉంటాయి. తూర్పు భారతదేశం సీట్ల సంఖ్యతో యూపీ సమానంగా నిలుస్తుంది. ఈ నేపథ్యంలో 2027 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మూడోసారి అధికారం నిలబెట్టుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. యోగి ఆదిత్యనాథ్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలనే ప్రయత్నంలో పార్టీ ఇప్పటి నుంచే గ్రాస్‌రూట్స్ స్థాయిలో వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. 2019లో బీజేపీ యూపీలో 62 సీట్లు గెలవగా, 2024లో కేవలం 33 సీట్లకు పరిమితమైంది. ఈ భారీ పతనం పార్టీని ఆత్మపరిశీలనకు దారితీసింది. 400 సీట్ల టార్గెట్‌ను చేరుకోలేకపోవడం వెనుక యూపీలోని నష్టాలు ప్రధాన కారణం. ఇకపై కులం, మతం ఆధారంగా కాకుండా పనితీరు, పాలనా ఫలితాల ఆధారంగా ఓటర్లను ఆకర్షించాలని బీజేపీ నిర్ణయించింది. ఈ మార్పు యోగి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధి పనులు, చట్టవ్యవస్థ బలోపేతం వంటి అంశాలను ప్రజల ముందు పెట్టడం ద్వారా విశ్వాసం పెంచే దిశగా ఉంది.బీజేపీ 18 జిల్లాల్లోని 64 అసెంబ్లీ స్థానాలను 'స్వింగ్ సీట్లు'గా గుర్తించి, వాటిపై ప్రత్యేక వ్యూహం రూపొందించింది. ఇక్కడ 2014, 2019, 2024 ఎన్నికల్లో ఓట్ల శాతం, ఇతర పార్టీల పనితీరు వివరంగా విశ్లేషించబడుతోంది. ఈ సీట్లలో బీజేపీ 10 వేల ఓట్లలోపు మెజారిటీతో ఓడిపోయినట్లు గుర్తించింది. ఇవి త్వరగా తిరిగి సాధించగల స్థానాలుగా భావిస్తోంది. పార్టీ అధ్యక్షుడు పంకజ్ చౌదరి, సంఘటన మంత్రి ధరమ్‌పాల్ సింగ్ ఈ 64 సీట్లను నేరుగా పర్యవేక్షిస్తున్నారు. క్లస్టర్ ఇన్‌చార్జీలను నియమించి, వారిని ఎన్నికల వరకు అక్కడే ఉంచి క్షేత్రస్థాయి పని చేయించే ప్రణాళిక సిద్ధం చేసింది. ఇది వనరులను సమర్థవంతంగా వినియోగించి, లక్ష్య సాధనకు సహాయపడే విధానం.హరియాణా, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అమలు చేసిన వ్యూహాల నుంచి యూపీకి పాఠాలు నేర్చుకుంది. బెంగాల్‌లో మమతా బెనర్జీ పాలనలో కూడా బీజేపీ 14 దళాలతో నంస్థాగతంగా బలవడింది. 44 ముస్లిం మెజారిటీ నియోజకవర్గాల్లోనూ, మిగతా ప్రాంతాల్లోనూ చిన్న చిన్న సమావేశాలు నిర్వహించి, వాలంటీర్లను నియమించి గ్రాస్‌రూట్స్ స్థాయిలో పని చేసింది. ఇదే తరహా విధానాన్ని యూపీలో కూడా అమలు చేస్తోంది. ఇప్పటికే యూపీలో 15 వేల గ్రూపులు ఏర్పాటు చేసి, ఒక్కో గ్రూపు రోజుకు 30 సమావేశాలు నిర్వహించేలా ప్రణాళిక వేసింది. ఎన్నికల నాటికి ఐదు లక్షల సమావేశాలు జరిపి, ప్రజాభిప్రాయాన్ని తన వైపుకు మళ్లించాలని లక్ష్యం. ఈ సమావేశాల ద్వారా పార్టీ పాలనా ఫలితాలు, యోగి ప్రభుత్వం చేసిన పనులు నేరుగా ఓటర్లకు చేరవేయడం, అనుమానాలు నివృత్తి చేయడం సాధ్యమవుతుంది.ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే 40 లక్షల కుటుంబాలను వ్యక్తిగతంగా కలిసి, వారి సమస్యలు విని, పార్టీ, ఎమ్మెల్యేలపై ఉన్న అసంతప్తిని తొలగించే ప్రయత్నం జరుగుతోంది. ఇది కేవలం ప్రచారం కాదు, నిజమైన అభిప్రాయ సేకరణ మరియు సమస్య పరిష్కార విధానం. 64 స్వింగ్ సీట్ల పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో ఈ పని మరింత తీవ్రంగా జరగనుంది. ఈ విధానం ద్వారా బీజేపీ 'పాలనా పనితీరు'ను ప్రధాన అంశంగా ముందుకు తెచ్చి, సాంప్రదాయకంగా జరిగే ఓటు బ్యాంకు రాజకీయాలను అధిగమించాలని చూస్తోంది.బీజేపీ వ్యూహం రెండు ముఖ్యమైన అంశాలపై ఆధారపడి ఉంది. ఒకటి ? లక్ష్య సాధన. 64 స్వింగ్ సీట్లపై దృష్టి పెట్టడం వల్ల వనరులు వృథా కాకుండా, ఫలితాలు త్వరగా రావచ్చు. రెండు ? గ్రాస్‌రూట్స్ సంస్థాగతీకరణ. ఇతర రాష్ట్రాల్లో విజయవంతమైన మోడల్‌ను అనుసరించడం వల్ల అనుభవం ఉంది. అయితే సవాళ్లు కూడా ఉన్నాయి. సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌లు బీజేపీని ఆపడానికి కలిసి పని చేయవచ్చు. యోగి ప్రభుత్వం చేసిన పనులను ఓటర్లు ఎంతవరకు గుర్తిస్తారు, స్థానిక అసంతృప్తులు ఎంతవరకు తొలగుతాయి అనేది నిజమైన పరీక్ష.మొత్తంమీద బీజేపీ ఇప్పటి నుంచే సమగ్రమైన, క్షేత్రస్థాయి కేంద్రిత వ్యూహంతో ముందుకు సాగుతోంది. 2027లో యోగి ఆదిత్యనాథ్ మూడోసారి సీఎంగా రావాలంటే ఈ స్వింగ్ సీట్లు, గ్రాస్‌రూట్స్ కార్యక్రమాలు నిర్ణయాత్మకంగా మారే అవకాశం ఉంది.

నిలిచిపోయిన ఊరు-వాడ

హైదరాబాద్ జూలై 23, (న్యూస్ పల్స్)వంద కోట్లతో సోషల్ సర్వీస్ చేస్తాం? గ్రామాలను తీర్చిదిద్దుతాం? ప్రజాసమస్యలను పాలకుల దగ్గరకు చేరుస్తామంటూ భారీ ఎలివేషన్లు ఇచ్చిన సంస్థ.. షట్‌డౌన్ చేస్తున్నట్టు సంచలన ప్రకటన చేసింది. అసలింతకి ఏం జరిగింది?? ఎన్టీఆర్ చెప్పినా ప్రజాసేవ ఆపేదేలేదన్న నిర్వాహకులు ఎందుకు వెనక్కి తగ్గారు?? కావాలనే ఆగిపోయారా?? ఎవరైనా ఆపేశారా?? అనేది సంచలనంగా మారింది.. సోషల్ మీడియా సెన్సేషన్.. రా ఎన్టీఆర్ సంస్థ బుధవారం సడెన్‌గా యూటర్న్ తీసుకుంది. తమ సేవలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు ఎక్స్‌లో ప్రకటించడం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. అయితే ఇది ఎన్టీఆర్ అభిమానుల ఒత్తిడితో జరిగిందా?? లేక ఎన్టీఆర్ ఆఫీస్ నుంచి డైరెక్ట్ మెసేజ్ ఏమైనా వెళ్లిందా?? లేకపోతే మరెవరి ప్రమేయమైనా ఉందా?? అన్న చర్చ సోషల్ మీడియాలో రచ్చ లేపుతోంది. రా ఎన్టీఆర్ సంస్థను నిలిపివేస్తున్నామని చెప్పడంతో పాటు? ఇందులో విషయం సాధించిన వారందరికి అభినందనలని ఫినిషింగ్ టచ్ ఇవ్వడం సరికొత్త చర్చకు తెరలేపింది. ఊరు?వాడ పేరుతో సుమారుగా 100 కోట్ల సేవా యజ్ఞం చేపడుతున్నట్టు రా ఎన్టీఆర్ సంస్థ ఆర్గనైజర్ సాయి రూప్ ఓ సంచలనమే సృష్టించారు. ఫ్యాన్స్ వద్దన్నా? తమ హీరో ప్రతిష్ట దెబ్బతింటుందని పలువురు కంప్లైంట్ చేసినా? రా ఎన్టీఆర్‌తో తమకు ఎలాంటి సంబంధం లేదని ఎన్టీఆర్ ఆఫీస్ నుంచి అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చినా ఏమాత్రం తగ్గకుండా ఈనెల 18న తిరుపతిలో మీటింగ్ పెట్టి తమ అజెండా ఏంటో వివరించారు సంస్థ ఆర్గనైజర్ సాయిరూప్. అభిమాని అంటే నలుగురికి ఉపయోగపడాలి అనే ఎన్టీఆర్ మాటను దృష్టిలో పెట్టుకొనే సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఎవరు అడ్డొచ్చినా, ఎన్ని కేసులు పెట్టినా సేవ చేస్తామని రా ఎన్టీఆర్ సంస్థకు భారీ ఎలివేషన్లిచ్చారు. కట్ చేస్తే? క్లోజ్ బటన్ నొక్కి ఇప్పుడందరిని షాక్‌కు గురిచేశారు.అయితే? ఎందుకు వెనక్కి తగ్గారో, సంస్థను ఎందుకు మూసివేస్తున్నారో అన్న విషయాలపై రా ఎన్టీఆర్ నిర్వాహకులు ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. కానీ 100 కోట్లు నిధులు ఎక్కడి నుంచి వస్తాయి అన్న ప్రశ్నలకు సాయి రూప్ దగ్గర స్పష్టమైన సమాధానం లేకపోవడం, ఫలితంగా పెద్దఎత్తున విమర్శలు రావడమూ ఓ కారణంగా చర్చించుకుంటున్నారు. మరోవైపు ఎన్టీఆర్ అభిమానుల సంఘం కన్వీనర్ సైతం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఆఫ్టర్ ప్రెస్‌మీట్ రా ఎన్టీఆర్ సంస్థపై విమర్శలు మరింత పెరిగాయి. దీంతోనే రా ఎన్టీఆర్ సంస్థ సేవలను నిలిపివేసిందన్న ప్రచారమూ జరుగుతోంది.మరోవైపు ఊరు-వాడ కార్యక్రమాన్ని క్యాన్సిల్ చేయాలని ముగ్గురు బలమైన వ్యక్తులు పోరాడుతున్నారు అంటూ తనదైన శైలిలో కామెంట్లు చేశారు సాయిరూప్. అయితే? ఇప్పుడు వారి మాటలు నిజమయ్యాయా.. నిజంగానే ఈ కార్యక్రమాన్ని నిలిపివేయడానికి కొన్ని శక్తులు పోరాడాయా?? అందుకే విజయం సాధించిన వారికి అభినందనలు అంటూ రా ఎన్టీఆర్ ఇలాంటి పోస్ట్ పెట్టిందా?? అంటూ పలు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా? ఇప్పుడు సోషల్ మీడియాలో వినిపిస్తున్న ఈ ప్రశ్నలన్నింటికి సమాధానం కావాలంటే రా ఎన్టీఆర్ ఆర్గనైజర్ సాయిరూప్ మళ్లీ మాట్లాడాల్సిందే.

ఆందోళనలతో ఢిల్లీ...

న్యూఢిల్లీ, జూలై 23, (న్యూస్ పల్స్)ఢిల్లీ నగరం ఆందోళనలతో అట్టుడికి పోతుంది. గతంలో కేంద్రం వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చింది. అప్పుడు హర్యానా, పంజాబ్ రాష్ట్రాలకు సంబంధించిన కొంతమంది రైతులు అందులో పాల్గొన్నారు. ఇదే అదునుగా ఖలీస్థానీ వేర్పాటు వాదులు అందులోకి ప్రవేశించారు. సరిగ్గా గణతంత్ర దినోత్సవం జరిగిన తర్వాత ఎర్రకోట మీద ఖలీస్థానీ జెండా ఎగరవేశా. దీంతో ఈ రైతు ఉద్యమం వెనుక ఉన్న అజెండా ఏమిటో అందరికీ అర్థమైంది. ఇదే సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వెంటనే ఆ చట్టాలను ఉపసంహరించుకున్నట్టు ప్రకటించారు. తద్వారా యూపీ ఎన్నికల్లో విపక్ష పార్టీలు ఊహించని విధంగా స్కెచ్ వేశారు. దీంతో ఆ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించింది. మనదేశంలో ఉద్యమాల వెనుక ఉన్న శక్తులు ఎలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయో నాడు ఈ సంఘటన బయటకు తెలిసేలా చేసింది.ఇప్పుడు ఢిల్లీలో కొంతమంది ఉద్యమాలు చేస్తున్నారు. నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. నీటి పేపర్ లీకేజీ.. విద్యార్థుల ఆత్మహత్యలు వంటిఘటనలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ఇటీవల సోనం వాంగ్ చుక్ నిరధిక నిరాహార దీక్షకు దిగారు. ఆ తర్వాత ఆయన దీక్షను ప్రభుత్వం విరమింపజేసింది. ఆయన ఢిల్లీలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సరిగా నిన్న ఢిల్లీలో విద్యార్థులు నిరసనలు చేపట్టారు. చలో పార్లమెంట్ నినాదంతో ఢిల్లీ నగరంలో హడావిడి చేశారు. పోలీసులు తమ లాఠీలకు పని చెప్పడంతో అక్కడ హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఢిల్లీలో కిసాన్ ఘాట్ వద్ద రైతులు నిరసన తెలపడం మొదలుపెట్టారు. వేల సంఖ్యలో ఢిల్లీకి చేరుకున్నారు. భారత్ ? అమెరికా వాణిజప్పంలో భాగంగా తక్కువ ధరకు.. రాయితీతో కూడిన అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు భారత మార్కెట్లను తెరవడాన్ని రైతులు వ్యతిరేకిస్తున్నారు. అందువల్లే శంభు బార్డర్ (పంజాబ్, హర్యానా సరిహద్దు) వద్దకు రైతులు భారీగా చేరుకున్నారు. అయితే పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి రైతులను అడ్డుకున్నారు.అటు బొద్దింకలు.. ఇటు రైతులు అందోళనలు చేస్తున్న నేపథ్యంలో మరోసారి బిజెపికి విపత్కర పరిస్థితి తప్పదా అంటూ విశ్లేషకులు వ్యాఖ్యలు చేస్తున్నారు. గతంలో కూడా రైతుల ఉద్యమం ముసుగులో చాలామంది ఢిల్లీలో తిష్ట వేసుకున్నారు. హింసాత్మక ఘటనలకు పాల్పడేందుకు ప్రణాళిక రూపొందించారు. అయితే పోలీసులు సమర్థవంతంగా అడ్డుకోవడంతో వారి పాచికలు పారలేదు. ఇప్పుడు మళ్లీ నీట్.. అమెరికా ఒప్పందం వంటి వాటిని ప్రధానంగా ప్రస్తావిస్తూ ఉద్యమాలు చేస్తున్నారు. అయితే దీని వెనక కూడా విదేశీ శక్తులు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. అందువల్లే ఈ ఉద్యమాలను ఉక్కుపాదంతో తొక్కి వేస్తున్నాయి.

హైదరాబాద్‌లో మరో ఫ్లైఓవర్..

రూ.345 కోట్లతో 6 లేన్లు.. మరింత వేగంగా ఎయిర్‌పోర్టుకు ప్రయాణం

హైదరాబాద్, జూలై 23, (న్యూస్ పల్స్)హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు జీహెచ్ఎంసీ మరో ఫ్లైఓవర్ నిర్మించేందుకు రెడీ అయింది. రూ.345 కోట్లతో మైలార్‌దేవ్‌పల్లి నుంచి కాటేదాన్, శంషాబాద్ రోడ్ వరకు 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే పాతబస్తీ, ఎల్‌బీ నగర్, కంచన్‌బాగ్, హయత్‌నగర్ ప్రాంతాల నుంచి ఎయిర్‌పోర్టుకు మరింత వేగంగా ప్రయాణం సాగనుంది. ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రయాణ సమయం, ఇంధన వ్యయం కూడా ఆదా కానుంది. ఈ ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియను జీహెచ్ఎంసీ వేగవంతం చేస్తోంది.హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) మరో కీలక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. పాతబస్తీ నుంచి శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించే లక్ష్యంతో కీలక ప్రాంతంలో ఫ్లైఓవర్ నిర్మించేందుకు సిద్ధమైంది. మైలార్‌దేవ్‌పల్లి నుంచి కాటేదాన్, శంషాబాద్ రోడ్ వరకు ఆరు లేన్ల గ్రేడ్ సెపరేటర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించింది.సుమారు రూ.345 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ఫ్లైఓవర్‌కు పరిపాలనా అనుమతులు వచ్చిన వెంటనే టెండర్ల ప్రక్రియ ప్రారంభించి పనులు చేపట్టేందుకు జీహెచ్ఎంసీ అధికారులు సిద్ధంగా ఉన్నారు. అధికారిక ఆమోదం కోసం ఎదురుచూస్తూనే ప్రాజెక్టు ఆలస్యం కాకుండా అవసరమైన ముందస్తు ఏర్పాట్లు కూడా వేగంగా కొనసాగుతున్నాయి. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయితే మైలార్‌దేవ్‌పల్లి, కాటేదాన్, శంషాబాద్ రోడ్ ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ రద్దీతో నరకం అనుభవించే వాహనదారులకు భారీ ఉపశమనం లభించనుంది.ముఖ్యంగా పాతబస్తీ, కంచన్‌బాగ్, ఎల్‌బీనగర్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం వంటి ప్రాంతాల నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికులు ట్రాఫిక్ జామ్‌లలో చిక్కుకోకుండా వేగంగా గమ్యస్థానానికి చేరుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఓవైసీ ఫ్లైఓవర్, చాంద్రాయణగుట్ట ఫ్లైఓవర్ దాటిన తర్వాత మైలార్‌దేవ్‌పల్లి జంక్షన్ వద్ద భారీ ట్రాఫిక్ కారణంగా ఆ మార్గంలో ఎయిర్‌పోర్టుకు వేళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే ఈ సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు ప్రయాణ సమయం, ఇంధన వ్యయం కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.ఈ ప్రాజెక్టు అమలులో భాగంగా అవసరమైన భూసేకరణ ప్రక్రియపై కూడా జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి పెట్టింది. భూమి యజమానులకు ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) ఇవ్వడం లేదా అవసరమైతే నష్టపరిహారం చెల్లించడం ద్వారా భూసేకరణను వేగవంతం చేయాలని అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నగర దక్షిణ భాగంలో ట్రాఫిక్ నిర్వహణ మరింత మెరుగుపడి.. ఎయిర్‌పోర్టు కనెక్టివిటీకి కొత్త ఊపు రానుంది.

ఎడ్యుకేషన్ హబ్ గా హైదరాబాద్

హైదరాబాద్, జూలై 23, (న్యూస్ పల్స్) తెలంగాణలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి (ట్రైసిటీస్) జిల్లాలు దేశంలోనే ఉన్నత విద్యకు ప్రధాన కేంద్రాలుగా సరికొత్త చరిత్ర సృష్టిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ నివేదిక ప్రకారం, అత్యధిక సంఖ్యలో కాలేజీలు కలిగిన జిల్లాల జాబితాలో ఈ మూడు జిల్లాలు జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో నిలిచాయి. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, ఆధునిక సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్ కోర్సులు, వేగంగా విస్తరిస్తున్న ఐటీ రంగంతో పాటు మహిళల భాగస్వామ్యం ఊహించని స్థాయిలో పెరగడం తెలంగాణ విద్యా రంగానికి కొత్త ఊపిరి పోసింది. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలు దేశంలోనే ఉన్నత విద్యకు ప్రధాన కేంద్రాలుగా మరింత బలపడుతున్నాయి. కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ తాజా నివేదికలో ఈ మూడు జిల్లాలు దేశంలో అత్యధిక కాలేజీలు ఉన్న జిల్లాల జాబితాలో అగ్రస్థానాల్లో నిలిచాయి. విస్తృతంగా పెరిగిన విద్యాసంస్థలు, ఆధునిక కోర్సులు, మెరుగైన మౌలిక వసతులు, ఐటీ రంగం విస్తరణ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపొందుతున్న విద్యా విధానాలు ట్రైసిటీస్‌ను దేశంలోనే ప్రముఖ విద్యా కేంద్రంగా నిలబెట్టాయని నివేదిక స్పష్టం చేసింది. హైదరాబాద్ జిల్లాలో 480కు పైగా, రంగారెడ్డి జిల్లాలో 390కు పైగా, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 310కు పైగా ఉన్నత విద్యాసంస్థలు ఉన్నాయి. సంప్రదాయ డిగ్రీ కళాశాలలతో పాటు వైద్య, న్యాయ, ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్, సైన్స్ వంటి విభిన్న రంగాల్లో విద్యను అందించే సంస్థలు అధిక సంఖ్యలో ఉండటం వల్ల దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది విద్యార్థులు ఇక్కడ చదువుకోవడానికి వస్తున్నారు. జాతీయ సగటుతో పోలిస్తే ప్రతి లక్ష జనాభాకు లభిస్తున్న కాలేజీల సంఖ్య కూడా ఈ జిల్లాల్లో ఎక్కువగా ఉండటం మరో ప్రత్యేకతగా నివేదిక పేర్కొంది.గత కొన్నేళ్లుగా హైదరాబాద్ ఐటీ, ఔషధ, స్టార్టప్ రంగాలకు కేంద్రంగా ఎదగడం ఉన్నత విద్యపై కూడా ప్రత్యక్ష ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లో ఏఐ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక కోర్సులకు భారీగా డిమాండ్ పెరిగింది. నివేదిక ప్రకారం ఈ రెండు జిల్లాల్లో 45 శాతానికి పైగా విద్యార్థులు (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్) కోర్సుల్లోనే చేరుతున్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టడం వల్ల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతున్నాయి.హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ, ట్రిపుల్ ఐటీ, కేంద్రీయ విశ్వవిద్యాలయంతో పాటు అనుబంధ కళాశాలల్లో సీట్ల భర్తీ రేటు గతంతో పోలిస్తే మెరుగుపడిందని సర్వే తెలిపింది. క్యాంపస్ ప్లేస్‌మెంట్లు పెరగడం, పరిశ్రమలతో విద్యాసంస్థల భాగస్వామ్యం బలపడటం, ఇంటర్న్‌షిప్ అవకాశాలు అధికంగా లభించడం వల్ల విద్యార్థులు ఈ ప్రాంతంలోని కాలేజీల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని పేర్కొంది.మహిళల ఉన్నత విద్యలో పాల్గొనడంలో కూడా ట్రైసిటీస్ విశేష పురోగతి సాధించాయి. ఒకప్పుడు ఆర్ట్స్, కామర్స్ కోర్సులకే పరిమితమైన మహిళలు ఇప్పుడు ఇంజినీరింగ్, టెక్నాలజీ, పరిశోధన, సైన్స్ రంగాల్లో కూడా పెద్ద సంఖ్యలో చేరుతున్నారు. హైదరాబాద్ జిల్లాలో ఉన్నత విద్యలో అమ్మాయిల నమోదు అబ్బాయిల కంటే ఎక్కువగా నమోదైంది. పీజీ, పీహెచ్‌డీ వంటి ఉన్నత స్థాయి పరిశోధన కోర్సుల్లో మహిళల నమోదు జాతీయ సగటును మించి ఉండటం మహిళా సాధికారతకు నిదర్శనంగా నివేదిక పేర్కొంది. ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ సదుపాయాలు, భద్రతా ప్రమాణాల మెరుగుదల కూడా ఇందుకు కారణాలుగా గుర్తించింది.మౌలిక వసతుల పరంగా కూడా హైదరాబాద్ ట్రైసిటీస్ దేశంలోని ఇతర విద్యా కేంద్రాలకు పోటీ ఇస్తున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లోని 90 శాతానికి పైగా కాలేజీల్లో వైఫై, స్మార్ట్ క్లాస్‌రూమ్స్, డిజిటల్ లైబ్రరీలు, ఆధునిక ప్రయోగశాలలు అందుబాటులో ఉన్నాయని సర్వే తెలిపింది. జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా ప్రయోగాత్మక బోధనకు ప్రాధాన్యం పెరగడంతో ల్యాబ్‌ల ఆధునీకరణ కూడా వేగంగా జరుగుతోందని పేర్కొంది. కౌన్సెలింగ్ కేంద్రాలు, పరిశోధన ఇంక్యుబేషన్ సెంటర్లు, క్రీడా వసతుల కల్పనలో కూడా ఈ జిల్లాలు ముందంజలో ఉన్నాయని వెల్లడించింది.అయితే విద్యార్థుల సంఖ్య వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో కొన్ని ప్రభుత్వ కళాశాలల్లో హాస్టల్ సదుపాయాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని నివేదిక సూచించింది. అధ్యాపకుల ఖాళీల భర్తీ, పరిశ్రమలతో మరింత అనుసంధానం, పరిశోధనకు ప్రాధాన్యం పెంచడం వంటి చర్యలు చేపడితే హైదరాబాద్ ట్రైసిటీస్ దేశానికే కాదు, అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రముఖ నాలెడ్జ్ హబ్‌గా ఎదిగే అవకాశాలు ఉన్నాయని కేంద్ర విద్యాశాఖ నివేదిక అభిప్రాయపడింది.

ఫస్ట్...లాస్ట్... తెలంగాణనే

హైదరాబాద్, జూలై 23, (న్యూస్ పల్స్)కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (ఖఉఐ) 2.0 నివేదికలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మిశ్రమ ఫలితాలను సాధించింది. ఓవరాల్ నేషనల్ ర్యాంకింగ్స్‌లో తెలంగాణ గణనీయమైన పురోగతిని సాధించి, గతంలో ఉన్న స్థానం నుంచి ఏకంగా 18వ స్థానానికి చేరింది. మొత్తం 1000 పాయింట్లకు గాను 599.7 స్కోరు సాధించి ప్రచేష్ట–3 బ్యాండ్‌లో నిలిచింది. స్కూళ్లకు విద్యార్థుల రాక , అడ్మిషన్ల ప్రక్రియలో సాధించిన ప్రగతి వల్లనే రాష్ట్రం ఓవరాల్ ర్యాంకింగ్‌లో పైకి ఎగబాకినట్లు ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.అయితే ర్యాంక్ మెరుగైనప్పటికీ అసలైన చదువుల నాణ్యతలో మాత్రం తెలంగాణ ఘోరంగా విఫలమైంది. విద్యార్థుల సామర్థ్యం, అధ్యయన ఫలితాలు.. అంటే లెర్నింగ్ ఔట్ కమ్ విభాగంలో రాష్ట్రం అత్యంత పేలవ ప్రదర్శన కనబరిచింది. ఈ విభాగానికి కేటాయించిన 240 మార్కులకు గాను తెలంగాణ కేవలం 69 మార్కులు (28.8%) మాత్రమే సాధించి, జాతీయ స్థాయిలో 26వ స్థానంలో నిలిచింది. తరగతి గదిలో బోధన, విద్యార్థుల్లో కనీస అక్షరాస్యత మరియు సంఖ్యా శాస్త్ర సామర్థ్యాలు ఇంకా తీవ్ర ఆందోళనకరంగానే ఉన్నాయని ఈ అంకెలు తేటతెల్లం చేస్తున్నాయి.మరోవైపు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత కూడా విద్యాశాఖను వేధిస్తోంది.స్ట్రాక్చర్ విభాగంలో కేటాయించిన 190 మార్కులకు 91.9 మార్కులు సాధించి రాష్ట్రం 20వ స్థానంలో నిలిచింది. వలు ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికీ తాగునీరు, సరైన శౌచాలయాలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో కేవలం ఓవరాల్ ర్యాంకింగ్‌పై మాత్రమే దృష్టి పెట్టకుండా, నాణ్యమైన విద్యనందించడంతో పాటు టీచర్ల శిక్షణ, మౌలిక వసతుల కల్పనపై విద్యాశాఖ తక్షణమే ప్రత్యేక శ్రద్ధ వహించాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

సొంత పార్టీపై విమర్శలు

హైదరాబాద్, జూలై 23, (న్యూస్ పల్స్)బీజేపీకి ఆయన బద్ధుడైన నాయకుడే. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలవడం అంటే ఆషామాషీ వ్యవహారం కానే కాదు. కానీ గెలిచి చూపించిన రాజకీయ మొనగాడు రాజాసింగ్. గోషామహల్ ఎమ్మెల్యేగా 2014 నుంచి వరుసగా బీజేపీ గుర్తుతో గెలిచి వస్తున్న రాజా సింగ్ ని పార్టీ 2023 ఎన్నికల తరువాత సస్పెండ్ చేసింది. ఆయన కొన్ని విషయాల్లో సొంత పార్టీ మీదనే విమర్శలు చస్తున్నారు అన్న కారణంతో పక్కన పెట్టారు. అయితే ఏదో నాటికి ఆయన బీజేపీ గూటికి చేరుతారు అన్న ప్రచారం ఒక వైపు ఉండగానే రాజా సింగ్ ఏ మాత్రం తగ్గడం లేదు. తన అభిప్రాయాలను ఆయన కుండబద్దలు కొడుతున్నారు. ఆయన బీజేపీకి నిర్మాణాత్మకమైన సూచనలు ఇస్తున్నట్లుగానే అవి ఉంటున్నా అదే సమయంలో ఘాటైన విమర్శలుగా కూడా కనిపిస్తున్నాయి బీజేపీ తెలంగాణాలో అధికారంలోకి వస్తుందా అని రాజా సింగ్ ప్రశ్నించారు. ఆ ఇద్దరు నేతలు కలిస్తే ఏమి జరుగుతుందని ఆయన కీలక ప్రశ్నను సంధించారు. ఆ ఇద్దరు నేతలు ఎవరో కాదు కేంద్ర మంత్రి బండి సంజయ్ అలాగే మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్. ఈ ఇద్దరు నాయకులను తెలంగాణా బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి అభయ్ సింగ్ పిలిపించి చేతులు కలిపారు. విభేదాలు మరచి కలసికట్టుగా పనిచేయాలని సూచించారు. దీంతో బీజేపీ తెలంగాణాలో తన వ్యూహాత్మకమైన అడుగులతో ముందుకు సాగుతోంది అన్న సంకేతాన్ని ఇచ్చినట్లు అయింది. ఇపుడు దానిని రాజా సింగ్ తప్పు పడుతున్నారు. ఇద్దరు నేతలు చేతులు కలిపితే బీజేపీ అధికారంలోకి వస్తుందా అని ఆయన నిలదీస్తున్నారు బీజేపీలో ఎంతో మంది సీనియర్ నాయకులు అలాగే కార్యకర్తలు ఉన్నారని ఆయన గుర్తు చేశారు. వారి సంగతి ఏమిటి అని కూడా ప్రశ్నించారు. అంటే పార్టీలో నాయకులందరినీ బీజేపీ ఇంకా కలుపుకొని పోవడం లేదన్న విమర్శ ఆయన మాటలలో కనిపిస్తోంది. అదే సమయంలో కార్యకర్తలకు ఉత్సాహం కలిగించేలా యాక్షన్ ప్లాన్ లేదని కూడా ఆయన చెబుతున్నట్లుగా ఉంది. నిజానికి బీజేపీలో ఇద్దరు కీలక నేతలు షేక్ హ్యాండ్స్ ఇచ్చుకున్నారు. విభేదాలు తగ్గాయి. ఇది మంచి సంకేతాలను ఇస్తుందని కమలనాధులు ఒక వైపు పొంగుతున్నారు. దాని మీద రాజా సింగ్ తన ఘాటు విమర్శలతో నీళ్ళు జల్లేశరు అని అంటున్నారు. .కమలం పార్టీ తెలంగాణాలో కదనోత్సాహంతో ఉంది. మూడు కార్పోరేషన్ల మేయర్ పదవులు గెలుచుకోవాలని పట్టుదలగా ఉంది. అలా తన సత్తా చాటాలని చూస్తోంది. అయితే బీజేపీ ఉత్సాహానికి గాలి తీసేశారు రాజాసింగ్ అంటున్నారు. మూడు కార్పోరేషన్ల మేయర్లు గెలవడం కాదు ముందు ఒక్క కార్పోరేషన్ లో అయినా సగం సీట్లు గెలిచి చూపించండి చాలు అని సవాల్ చేసేలా మాట్లాడారు. అంటే బీజేపీకి ఒక్క కార్పోరేషన్ గెలిచే అవకాశాలు లేవని రాజా సింగ్ తన ముందస్తు అంచనాను ఇలా బయటపెట్టారా అని చర్చ సాగుతోంది. అంతే కాదు ఆయన బీజేపీ ప్రస్తుత అధ్యక్షుడు రామచంద్రరావు మీద మీద కూడా కామెంట్స్ చేశారు. ఆయన చేతులు కట్టేశారని మరి ఎలా పనిచేస్తారు అని ప్రశ్నించారు ఒక వ్యక్తి కోసమే అధినాయకత్వం ఆలోచించే విధానాలు వద్దు అని హితవు పలికారు. మొత్తానికి దూరంగా ఉంటూనే కమలానికి కఠినమైన తీరులోనే సలహాలు సూచనలతో పాటు దిశా నిర్దేశం చేశారు రాజాసింగ్. దీనిని బీజేపీ అధినాయకత్వం ఏ విధంగా చూస్తుంది అన్నదే ఇపుడు చర్చ మరి.

హరీష్ ఇంపాక్ట్ ...పాదయాత్రలో తగ్గని క్రేజ్



మెదక్, జూలై 23, (న్యూస్ పల్స్) తెలంగాణ రాజకీయాల్లో ట్రబుల్ షూటర్ గా, గ్రౌండ్ లెవల్ మాస్ లీడర్‌గా చెరగని ముద్ర వేసుకున్న మాజీ మంత్రి హరీష్ రావు వైఖరి ఇప్పుడు గులాబీ శ్రేణుల్లోనే కాకుండా, ప్రత్యర్థి వర్గాల్లోనూ తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. సిద్దిపేట జిల్లా మండల స్థాయిలో హరీష్ రావు చేపట్టిన 15 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్రకు రైతులు, ప్రజల నుంచి ఊహించని స్థాయిలో అపూర్వ స్పందన లభించింది. కాళేశ్వరం పంపులను వెంటనే ప్రారంభించి, గౌదావరి జలాలతో రంగనాయక సాగర్‌ను నింపాలని డిమాండ్ చేస్తూ ఆయన నిర్వహించిన ఈ యాత్ర.. కేవలం ఒక మండల స్థాయి నిరసనలా కాకుండా, ఒక రాష్ట్ర స్థాయి ప్రజా ఉద్యమాన్ని తలపించేలా జనసందోహాన్ని ఆకర్షించింది.కేవలం ఒక మండల స్థాయిలోనే హరీష్ పిలుపునకు ఈ స్థాయిలో జనం తరలివస్తే.. ఒకవేళ ఇదే పాదయాత్రను ఆయన నియోజకవర్గ స్థాయికో లేక రాష్ట్ర స్థాయికో విస్తరిస్తే ఉండే మాస్ ఇంపాక్ట్ ఎలా ఉంటుందనే చర్చ పొలిటికల్ సర్కిళ్లలో గట్టిగా నడుస్తోంది. సోషల్ మీడియా బిల్డప్‌లు, పెయిడ్ ప్రచారాల కంటే క్షేత్రస్థాయిలో ప్రజలతో ఉండే లైవ్ కనెక్టివిటీయే నాయకుడి అసలైన బలం అని హరీష్ రావు మరొకసారి నిరూపించారు. బీఆర్ఎస్ ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత చాలామంది కీలక నేతలు వ్యూహాత్మక మౌనం దాల్చినా , సోషల్ మీడియా వేదికలకే పరిమితమైనా.. హరీష్ రావు మాత్రం రోడ్డెక్కి రైతు సమస్యలపై, ప్రభుత్వ వైఫల్యాలపై క్షేత్రస్థాయి పోరాటానికే ప్రాధాన్యత ఇస్తున్నారుఅయితే, హరీష్ రావు ఏం చేసినా సరే ఆయన చుట్టూ రకరకాల రాజకీయ ఊహాగానాలు, అంతర్గత నమీకరణల ప్రచారాలు ముసురుకోవడం పరిపాటిగా మారింది. ప్రజాక్షేత్రంలో ఆయన చురుగ్గా ఉంటూ భారీగా జనాన్ని సమీకరిస్తే.. పార్టీతో సంబంధం లేకుండా సొంత ఇమేజ్, పర్సనల్ బ్రాండ్ పెంచుకోవడానికి యత్నిస్తున్నారు అని సొంత పార్టీలోని కొందరు వ్యతిరేక వర్గీయులు ముద్రవేసే యత్నం చేస్తారు. అదే సమయానికి ఆయన కొద్దిరోజులు సైలెంట్‌గా ఉంటే.. పార్టీ నాయకత్వంపై అలిగారు, విముఖతతో ఉన్నారు అంటూ ప్రత్యర్థులు ప్రచారం మొదలుపెడతారు. ఈ రెండింటి మధ్య హరీష్ రావు సమన్వయం పాటిస్తూ, తన పని తాను చేసుకుపోతుండటం ఆయన పరిణతికి నిదర్శనంహరీష్ రావు అంతర్గత వ్యూహాలు ఎప్పుడూ అంత సులభంగా బోధపడవు. ఒకవేళ హరీష్ రావు ఆలోచన ధోరణిలో చిన్నపాటి మార్పు వచ్చినా లేదా ఆయన వేరే రాజకీయ ఆలోచనల్లో ఉన్నారనే అనుమానం బీఆర్ఎస్ హైకమాండ్‌కు వస్తే.. అది కేవలం ఆ పార్టీలోనే కాక మొత్తం తెలంగాణ రాజకీయ యవనికపైనే ఒక భారీ పొలిటికల్ పెను భూకంపం సృష్టిస్తుందనడంలో సందేహం లేదు. గులాబీ దళంలో అత్యంత కేడర్ బేస్, మాస్ అప్పీల్ ఉన్న నేత కావడంతో.. ఆయన ప్రతి కదలికపై ప్రగతి భవన్ నుంచి ఫామ్‌హౌస్ వరకు, గజ్వేల్ నుంచి సిద్దిపేట వరకు నిరంతరం నిఘా మరియు చర్చ నడుస్తూనే ఉంటాయి. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రైతుల్లో వ్యక్తమవుతున్న అసంతృప్తిని, నీటి పారుదల ప్రాజెక్టుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను ఆయుధంగా మలుచుకోవడంలో హరీష్ రావు సక్సెస్ అవుతున్నారు. పార్టీ పదవుల హోదా కంటే, ప్రజల్లో తనకున్న అసలైన గ్రౌండ్ వవర్ ఏంటో నిరూపించుకోవడానికే ఆయన ప్రాధాన్యత ఇస్తున్నారు. సిద్దిపేట పాదయాత్ర ద్వారా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వానికే కాదు, సొంత పార్టీలోని తన వ్యతిరేకులకు కూడా స్పష్టమైన సంకేతాలు పంపారని భావించవచ్చు. మాస్ లీడర్‌షిప్‌కు ప్రత్యామ్నాయం లేదని ఆయన క్షేత్రస్థాయి ఫలితాల ద్వారా చాటిచెబుతున్నారు.వూహాగానాలు, రాజకీయ విమర్శలను ఏమాత్రం పట్టించుకోకుండా హరీష్ రావు తన సొంత శైలిలోనే రైతు పోరాట బాట పట్టారు. రాబోయే రోజుల్లో ఈ పాదయాత్రలను ఇతర నియోజకవర్గాలకు విస్తరిస్తే, అది బీఆర్ఎస్ పార్టీకి ప్రధాన పునరుత్తేజంగా మారే అవకాశం ఉంది. అయితే, ఈ ప్రజాదరణను పార్టీ నాయకత్వం ఎలా స్వీకరిస్తుంది, హరీష్‌ను ఏ రకంగా ముందుకు నడిపిస్తుంది అనేదానిపైనే బీఆర్ఎస్ భవిష్యత్ రాజకీయ వ్యూహాలు , తెలంగాణ రాజకీయ సమీకరణలు ఆధారపడి ఉన్నాయి.

అవినీతి అనకొండే...

హైదరాబాద్, జూలై 23, (న్యూస్ పల్స్)హైదరాబాద్‌లో ట్రాన్స్‌కో డీఈ ముత్యం వెంకటరమణపై ఏసీబీ దాడులు నిర్వహించి ఆదాయానికి మించిన ఆస్తులను భారీగా గుర్తించింది. 9 ప్రాంతాల్లో జరిగిన సోదాల్లో కిలోల కొద్దీ బంగారం.. భారీగా డబ్బు, విలువైన ఆస్తులు, కార్లు, కమర్షియల్ భవనాలు, అపార్ట్‌మెంట్లకు సంబంధించిన పత్రాలు బయటపడ్డాయి. గతంలో లంచం కేసులోనూ అరెస్టైన వెంకటరమణను ఈసారి అక్రమాస్తుల కేసులో అరెస్ట్ చేశారు. ఈ సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాల ఆధారంగా ఏసీబీ అధికారులు మరింత లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు.తెలంగాణలో అవినీతి అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. దీంతో లంచాలు తీసుకుని అక్రమాస్తులు కూడబెట్టిన అధికారులు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ట్రాన్స్‌కో డిప్యూటీ ఇంజనీర్ (డీఈ) ముత్యం వెంకటరమణ.. ఏసీబీ అధికారులకు చిక్కారు. భారీగా అక్రమాస్తులు గుర్తించడంతో.. ఆయనను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని నివాసంతో పాటు ఆయనకు సంబంధించిన మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. దాదాపు 12 గంటల పాటు సాగిన ఈ తనిఖీల్లో భారీ ఎత్తున అక్రమాస్తులు వెలుగులోకి రావడంతో వెంకటరమణను అధికారులు అరెస్ట్ చేశారు.ఏసీబీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ముత్యం వెంకటరమణ ఆదాయానికి మించి రూ.27.65 కోట్ల విలువైన ఆస్తులు కూడబెట్టినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఈ విలువ లెక్కించగా.. బహిరంగ మార్కెట్‌లో ఆస్తుల విలువ రూ. వందల కోట్లలో ఉండే అవకాశముందని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు.ఈ ఏసీబీ అధికారుల సోదాల్లో 2 కిలోలకు పైగా బంగారు ఆభరణాలతోపాటు.. రూ.52 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు.. వజ్రాభరణాలు, విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు, విదేశీ మద్యం సీసాలు సీజ్ చేశారు. కియా, మహీంద్రా, బలెనో కంపెనీలకు చెందిన 3 కార్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.అంతేకాకుండా శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి ప్రాంతాల్లో నివాస ఫ్లాట్లు, కమర్షియల్ భవనాలు, గుట్టల బేగంపేట్‌లో జీ+5 భవనం, మూసాపేట్‌లో రూ.20 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న 10 అపార్ట్‌మెంట్లతో పాటు ముత్యం వెంకటరమణ భార్య స్వప్న పేరుతో నిర్మాణ రంగంలో భారీ పెట్టుబడులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు

రామవరం మాతా–శిశు ఆరోగ్య కేంద్రాన్నితనిఖీ చేసిన కలెక్టర్

భద్రాచలంమాతా–శిశు ఆరోగ్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా గర్భిణీలు, బాలింతలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ వైద్య అధికారులను ఆదేశించారు.రామవరం మాతా–శిశు ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేసి ఆసుపత్రి ఆవరణ, ఓపీ విభాగం, ప్రసూతి వార్డులు, లేబర్ రూమ్, శిశు వార్డు, ఔషధ నిల్వ గది తదితర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలు, రోగులకు అందుతున్న చికిత్సపై వైద్యులతో సమీక్షించారు.చికిత్స పొందుతున్న గర్భిణీలు, బాలింతల ఆరోగ్య పరిస్థితి, వైద్య పరీక్షలు, మందుల పంపిణీ, పోషకాహార సదుపాయాలు, ప్రసవాల సంఖ్యపై వివరాలు తెలుసుకున్న జిల్లా కలెక్టర్, ప్రభుత్వం అందిస్తున్న అన్ని సేవలు లబ్ధిదారులకు సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.తరువాత రోగుల నమోదు వివరాలు, ప్రసవాల రికార్డులు, ఔషధ నిల్వలు, విధి నిర్వహణ రిజిస్టర్లు, సిబ్బంది హాజరు నమోదును క్షుణ్ణంగా పరిశీలించి, ప్రతి ఉద్యోగి సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగిని ఆప్యాయంగా పలకరించి, అవసరమైన వైద్య సేవలను ఎలాంటి ఆలస్యం లేకుండా అందించాలని, గర్భిణీలు, బాలింతలు, నవజాత శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా వైద్య సేవలు అందుబాటులో ఉండాలని వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి సూచించారు.ఆసుపత్రి ప్రాంగణం, వార్డులు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, ఆసుపత్రి పరిశుభ్రతపై ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచేలా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, నర్సులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

చెరువులోకి దూసుకెళ్లిన కారు...

ఐదుగురి మృతి

భువనేశ్వర్: ఒడిశాలో విషాద ఘటన చోటుచేసుకుంది. దేంకానాల్ జిల్లా సదర్ ఠాణా పరిధిలోని మహిషాపుటా వద్ద గురువారం ఓ పెళ్లి బృందం కారు అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. ప్రమాదాన్ని గుర్తించిన గ్రామస్థులు వెంటనే ట్రాక్టర్ సాయంతో కారును బయటకు తీశారు. అయితే, అప్పటికే కారులో ఉన్న ఏడుగురిలో ఐదుగురు ఊపిరాడక మృతి చెందారు. ప్రాణాలతో బయటపడిన ఇద్దరిని దేంకానాల్ ఆసుపత్రికి తరలించారు. మృతులు బంగురిసింగి గ్రామానికి చెందిన చంద్రకాంత్ స్వయిన్, అవినాష్ సాహు, అభిషేక్ సాహు, రాకేశ్ సాహు, రామ్ సాహులుగా గుర్తించారు. బుధవారం రాత్రి వీరు ఓ వివాహానికి హాజరై, స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా.. ఈ ప్రమాదం చోటుచేసుకుంది.మరోవైపు కేంఝర్ జిల్లాలో బుధవారం రాత్రి ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. అస్వస్థతకు గురైన తమ కుమారుడిని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఖాళీగా కనిపిస్తున్న జలాశయాలు

హైదరాబాద్, జూలై 23, (న్యూస్ పల్స్)ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు పూర్తయ్యాయి. కానీ, ప్రధాన నదులపై ఉన్న జలాశయాలకు ఇప్పటివరకు నీటి ప్రవాహం రాలేదు. శ్రీశైలం జలాశయానికి కేవలం 5.9 టీఎంసీల నీరు మాత్రమే చేరింది, అది కూడా స్థానిక వర్షాల వల్ల. సాధారణంగా జూన్‌లో నీటి ప్రవాహం తక్కువగా ఉన్నప్పటికీ, జులైలో కనీసం 200 టీఎంసీల వరద వచ్చే అవకాశం ఉంటుంది. కానీ ఈసారి పరిస్థితులు మారాయి. గత 25 సంవత్సరాలలో, ఖరీఫ్‌లో జూన్ మరియు జులైలో శ్రీశైలానికి 10 టీఎంసీల కంటే తక్కువ నీటి ప్రవాహం వచ్చిన సంవత్సరాలు 6 ఉన్నాయి. ఈ ఏడాది కూడా అలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి, ఇది రైతులకు తీవ్ర ఆందోళన కలిగిస్తుంది.కర్ణాటకలోని ఆల్మట్టిలో ప్రస్తుతం 47 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది, కానీ ఆల్మట్టికి నిండటానికి ఇంకా 28 టీఎంసీల నీరు అవసరం. నారాయణపూర్‌కు 12 టీఎంసీల నీరు కావాలి. జులైలో ఆల్మట్టిలో పూర్తి స్థాయి నీటి నిల్వ జరగకూడదు. అయితే, ఎల్‌నినో ప్రభావం వల్ల వచ్చిన నీటిని నిల్వ చేస్తున్నారు, దీనిని హైడ్రో ఎలక్ట్రిసిటీ ఉత్పత్తి కోసం మరియు కాలువల కింద సాగుకు ఉపయోగిస్తున్నారు. ఈ నెలలో జూరాలకు నీటిని విడుదల చేయడం కష్టమవుతుంది, ఎందుకంటే ప్రవాహం పెరగకపోతే, నాగార్జునసాగర్ మరియు శ్రీశైలం జలాశయాలపై ప్రభావం ఉంటుంది.గోదావరి నదిలో కూడా పరిస్థితి అంతే. ప్రాణహిత నదిలో కూడా ఈ ఏడాది తక్కువ వరద ఉంది. మేడిగడ్డ వద్ద 16,500 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది

కేంద్ర మంత్రి రాజీనామా చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం : మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



మహబూబ్ నగర్ : నీట్‌లో జరిగిన అక్రమాలపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసే వరకు , పేపర్ లీక్ చేసే వారికీ కఠిన శిక్షలు పడే వరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. ఢిల్లీలో విద్యార్థి, యువతపై కేంద్ర ప్రభుత్వ అణిచివేతకు వ్యతిరేకంగా మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ ఆధ్వార్యాన నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి మాట్లాడుతూ పేపర్ లీకేజిలతో పిల్లల భవిష్యత్తుపై తల్లి తండ్రులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఇప్పటి వరకు 150 సార్లు పేపర్లు లీక్ అయితే బాద్యులపై కేంద్రం కఠిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఢిల్లీలో విద్యార్థి, యువకులపై పోలీసులు లాఠీలతో ఇష్టం వచ్చినట్టు కొడుతున్నా బీజేపీ,కాంగ్రెస్ వట్టించుకోవడం లేదని విమర్శించారు.కాక్రోచ్ పార్టీ ఆందోళనలో విద్యార్థులు, యువత కదిలి రావడంతో రాహుల్ గాంధీ హడావుడిగా మద్దతు తెలుపుతూ నిరసన వ్యక్తం చేశారని పేర్కొన్నారు. నీట్ పరీక్షాల నిర్వహణ బాధ్యతలు రాష్ట్రాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్రమాలను అరికట్టాలంటే రాష్ట్రాలకు అధికారం ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలో ఫీజు రియంబర్స్ మెంట్ పథకం మూసి వేయడంతో పేద విద్యార్థులు ఆందోళనలో ఉన్నారని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాల్యా నాయక్, నాయకులు అభిలాష్ రావు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, పట్టణ అధ్యక్షులు శివరాజ్, మహబూబ్ నగర్ మండల అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, హన్వాడ మండల అధ్యక్షులు కరుణాకర్ గౌడ్, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ ఆంజనేయులు, కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఇడికూడలో కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



చండూరు, జూలై 23 : ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని చండూరు మండలం ఇడికూడ సర్పంచ్ పాల్వాయి రమాదేవి ప్రజలను కోరారు. కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం అని ఆమె అన్నారు. గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మారుతున్న జీవన విధానం వల్ల వస్తున్న వివిధ రోగాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కామినేని ఆస్పత్రి వారు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయటం వల్ల నిరుపేదలకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు.నిరుపేద ప్రజలకు వైద్యం వారి ఇంటి ముందుకే తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. ఈ వైద్య శిబిరంలో గ్రామస్తులకు బి.పి., షుగర్, కంటి, మోకాలు నొప్పులు, పంటి సమస్యలకు వివిధ పరీక్షలు నిర్వహించారు. మోకాలు, పంటి నొప్పులతో తీవ్రంగా బాధపడుతున్న 15 మందిని శుక్రవారం కామినేని హాస్పిటల్ కు తీసుకువెళ్లి చికిత్స అందించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కడారి నర్సింహా, వార్డు మెంబర్లు నాంపల్లి విజయ, ఇరిగి నాగరాజు, కామినేని ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్‌లో కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులపై దృష్టి సారించాలి

నాగర్ కర్నూల్ : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులపై దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి సూచించారు. తెల్కపల్లి మండల బూత్ లెవల్ ఏజెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 86 శాతం డిజిటలైజేషన్ పూర్తి అయిందని, మిగిలిన ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫామ్స్ నింపి బీఎల్‌వో (ఐూ)తో డిజిటల్ చేయించాలని కోరారు.వచ్చే నెల 3 వ తేదీ తర్వాత డ్రాఫ్ట్ లిస్టును పరిశీలించి ఇంకా రాని ఓట్లను, కొత్త ఓటర్ల ను,మ్యాపింగ్ కానీ ఓటర్లకు వచ్చే నోటీసులపై దృష్టి పెట్టాలని సూచించారు. చనిపోయిన ఓటర్ల వివరాలు, పర్మనెంట్ షిఫ్టింగ్ ఓటర్ల వివరాలు జాగ్రతగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమీక్షలో బీఎల్ఏలు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు .



'విద్యార్థులతో పెట్టుకుంటే ప్రభుత్వ పతనం తప్పదు'

ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వరక అజిత్

కొత్తగూడెం గణేష్ టెంపుల్, జూలై 23 : రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వరక అజిత్ విమర్శించారు. విద్యార్థుల హక్కులను కాలరాస్తూ, ప్రభుత్వ విద్యను బలహీనపరిచే విధానాలను కొనసాగిస్తే విద్యార్థుల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని, "విద్యార్థులతో పెట్టుకుంటే ప్రభుత్వ పతనం తప్పదు" అని హెచ్చరించారు. విద్యారంగ సమస్యల సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి విజయవంతమైంది. వేలాది మంది విద్యార్థులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఒకానొక దశలు కలెక్టరేట్ ద్వారా గేటును తోసుకుంటూ లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించిన విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు



దీంతో ఏఐఎస్ఎఫ్ జెండాలు పట్టుకొని పలువురు విద్యార్థులు గేట్లు ఎక్కి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారు చదువులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ రోజురోజుకూ సంక్షోభంలోకి నెట్టబడుతోందని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల కొరత, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల లేమి కారణంగా నాణ్యమైన విద్య దూరమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి వెంటనే పూర్తి స్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యా రంగానికి దిశానిర్దేశం చేసే నాయకత్వం లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. ఈ పరిస్థితిని అరికట్టేందుకు తెలంగాణలో ఫీజు నియంత్రణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ఫీజులపై ప్రభుత్వం కఠిన నియంత్రణ తీసుకురావాలని డిమాండ్ చేశారు.విద్యాహక్కు చట్టాన్ని రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో సమర్థవంతంగా అమలు చేయాలని, పెద్ద విద్యార్థులకు ఉచితంగా 25% సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధ బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగుతాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యా రంగాన్ని గాడిలో పెట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అజిత్ డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఏఓ కృష్ణ ప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు ఇనపల్లి పవన్ సాయి, గుండల సుజన్, మాణిక్యాల వినయ్, గుగులోత్ వంశీ, జిల్లా ఉపాధ్యక్షులు అక్కినపల్లి నాగేంద్రబాబు, కొరిమి సంజయ్ పాల్గొన్నారు.

పేట్రియాట్ డిఫెన్స్ సిస్టమ్, ఎంక్యూ-9 డ్రోన్ల డిపో, థాడ్ రేడార్‌ను ధ్వంసం చేసిన ఇరాన్

టెహ్రాన్: అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులుకొనసాగిస్తూనే ఉన్నది. అయితే తాజాగా గురువారం జరిగిన దాడిలో అమెరికా తన ఆయుధాలను కోల్పోయినట్లు తెలుస్తోంది. కువైట్, జోర్డాన్‌లో ఉన్న అమెరికా ఆయుధాలపై ఇరాన్ ప్రతీకార దాడులు చేసింది. అయితే కువైట్‌లో ఉన్న అమెరికన్ పేట్రియాట్ డిఫెన్స్ సిస్టమ్, ఎంక్యూ-9 డ్రోన్ డీపో, జోర్డాన్‌లో ఉన్న థాడ్ రేడార్ సిస్టమ్ ధ్వంసమైనట్లు ఇరాన్ ప్రకటించింది. ఇరాన్ ప్రభుత్వ మీడియాలో ఈ



విషయాన్ని వెల్లడించారు. అమెరికా పదేపదే దాడులు చేస్తున్న నేపథ్యంలో ప్రతీకారంగా జోర్డాన్‌లో ఉన్న అమెరికా స్థావరాలపై అటాక్ చేసినట్లు ఇరాన్ పేర్కొన్నది.జోర్డాన్‌లో ఉన్న అమెరికా థాడ్ మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్‌ను మెరుపు వేగంతో నాశనం చేశామని ఐఆర్జీసీ తన ప్రకటనలో తెలిపింది. పేట్రియాట్ సిస్టమ్, సీ-రామ్ రేడార్‌ను కూడా ధ్వంసం చేశామని ఐఆర్జీసీ పేర్కొన్నది. ఓ భారీ హెలికాప్టర్ ఎక్విప్మెంట్ వేర్‌హౌజ్‌ను కూడా ధ్వంసం చేసినట్లు ఇరాన్ చెబుతోంది. అక్కడ హెలికాప్టర్లను రిపేర్ చేస్తారు. ఆపరేషన్ లైటనింగ్ పేరుతో సాగుతున్న దాడుల్లో కువైట్‌లో ఉన్న మూడు అమెరికా బేస్‌లు ధ్వంసమైనట్లు ఇరాన్ ఆర్మీ తెలిపింది.దోహా బేస్‌లో ఉన్న అమ్యూనిషన్, లాజిస్టిక్స్ డిపోలను తమ డ్రోన్లు పేల్చివేసినట్లు ఇరాన్ ప్రకటించింది. కువైట్‌లో ఉన్న అలీ అల్ సలీం ఎయిర్‌బేస్‌ను టార్గెట్ చేసినట్లు ఐఆర్జీసీ తెలిపింది. అక్కడ ఉన్న పేట్రియాట్ మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్‌తో పాటు ఎంక్యూ-9 డ్రోన్లకు చెందిన హ్యాంగర్‌ను పేల్చివేసినట్లు చెప్పింది.

ప్రధాని నివాసం ముందు కాంగ్రెస్ నిరసన..

వాంగ్‌చుక్ భార్య విమర్శలు

న్యూఢిల్లీలోని ప్రధాని నివాసం ముందు జులై 21న నీట్ పేపర్ లీక్ అంశంపై కాంగ్రెస్ నిరసన కార్యక్రమం చేపట్టడాన్ని సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి విమర్శించారు. కాంగ్రెస్ నిరసనల్లో చిత్తశుద్ధి లోపించిందని అన్నారు. జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులు నిరసనకు దిగినప్పుడే కాంగ్రెస్ కూడా వచ్చి నిరసనల్లో పాలుపంచుకుని ఉండాల్సిందని వ్యాఖ్యానించారు. పేపర్ లీక్ ఉదంతంపై సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ జంతర్‌మంతర్ వద్ద తొలుత ఆమరణ దీక్ష ప్రారంభించిన




విషయం తెలిసిందే. ఆ తరువాత పోలీసులు ఆయనను ఆనుపత్రికి తరలించడంతో ప్రస్తుతం అక్కడే దీక్షను కొనసాగిస్తున్నారు.నిరసనల్లో రాజకీయ పార్టీలు కూడా రంగ ప్రవేశం చేయడంపై వాంగ్‌చుక్ భార్య పలు కీలక వ్యాఖ్యలు చేశారు. వాంగ్‌చుక్ పేరుప్రఖ్యాతులను తమకు అనుకూలంగా వాడుకునేందుకు రాజకీయ పక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. అయితే, ప్రజలను మభ్యపెట్టడం ఇక సాధ్యం కాదని అన్నారు. చిత్తశుద్ధి లేని వారిని యువతే పంపించేస్తారని అన్నారు. కాక్రోచ్ జనతా పార్టీ సారథ్యంలో నిరసనలు రాజకీయ పక్షాలకు గట్టి సందేశం పంపించాయని ఆమె అన్నారు. తమ దృష్టిలో పార్లమెంటే అత్యున్నత వ్యవస్థ అని, తమకు ఇక ప్రతిపక్షం, పాలకపక్షం లేదని వ్యాఖ్యానించారు. పార్లమెంటే ఈ అంశంపై దృష్టి సారించాలని కోరుతున్నామని అన్నారు. రాజకీయ లక్ష్యాలు లేని వారు తమతో కలిసి రావచ్చని అన్నారు.నిజాయతీ, స్వచ్ఛత పునాదిగా ఈ ఉద్యమం ఆరంభమైందని గీతాంజలి చెప్పారు. సొంత ఎజెండాలతో వచ్చే వారు తమంతట తామే పక్కకు తప్పుకోవాల్సి వస్తుందని అన్నారు. పార్లమెంటు వరకూ విద్యార్థులు చేపట్టిన మార్చ్‌ను కేంద్రం అడ్డుకోవడాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, పార్టీ ఇతర నేతలు జులై 21న ప్రధాని నివాసం ముందు నిరసనకు దిగిన విషయం తెలిసిందే. దీంతో, పోలీసుల రాహుల్ గాంధీని అక్కడి నుంచి బలవంతంగా తరలించాల్సి వచ్చింది.

ఢిల్లీ ఆందోళనల్లో సంఘ విద్రోహ శక్తుల చొరబాటు!: ఢిల్లీ పోలీసులు

దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనలపై పోలీసులు సంచలన ఆరోపణలు చేశారు. జంతర్‌మంతర్ వద్ద కొనసాగుతున్న విద్యార్థుల నిరసనల్లో సంఘ విద్రోహ శక్తులు చొరబడుతున్నాయని ఆరోపించారు. విద్యార్థుల మధ్య దాక్కుని ఉంటూనే.. కొందరు వ్యక్తులు ఒక్కసారిగా రాళ్లు, వాటర్ బాటిళ్లతో తమపై దాడులకు దిగుతున్నారన్నారు. దీంతో శాంతియుతంగా కొనసాగాల్సిన నిరసనలు కాస్తా సాయంత్రమయ్యేసరికి హింసాత్మకంగా మారుతున్నాయని ఢిల్లీ పోలీసులు చెప్పారుపోలీసుల కథనం ప్రకారం.. పగటి వేళల్లో నిరసనకారులు కవితలు చదవడం, నినాదాలు చేయడం వంటి శాంతియుత కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ.. సాయంత్రం అవ్వగానే భారీ సంఖ్యలో గుమిగూడుతున్నారు. దీంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోతోంది. కొందరైతే పోలీసులే లక్ష్యంగా రాళ్లు రువ్వడం, రోడ్లెక్కి అల్లర్లు చేస్తుండటంతో ఉద్రిక్తత నెలకొంటోందని తెలిపారు.ఈ నేపథ్యంలో పరిస్థితిని అదుపు చేసేందుకు జంతర్‌మంతర్ వద్ద అదనపు పారామిలిటరీ బలగాలను మోహరించినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.


నీట్ వివాదంపై 26న ఉమ్మడిగా నిరసన ర్యాలీ..

ఉద్ధవ్, రాజ్ ఠాక్రే ప్రకటన



ముంబై: నీట్ వివాదంపై జూలై 26న ఉమ్మడిగా నిరసన ర్యాలీ చేపడతామని శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రే ప్రకటించారు. తమ శాంతియుత నిరసనను భగ్నం చేసేందుకు ప్రయత్నించే వారిని చితకబాదుతామని రాజ్ ఠాక్రే హెచ్చరించారు. నీట్ పేపర్ లీక్ వివాదంతో పాటు ఢిల్లీలో నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల చర్యకు వ్యతిరేకంగా శివసేన (యూబీటీ), ఎంఎన్ఎస్ ఆధ్వర్యంలో ఉమ్మడిగా నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఇద్దరు నేతలు గురువారం తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆవేదన తెలియజేయడానికే ఈ నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు వివరించారు.కాగా, జూలై 26న తలపెట్టిన ఈ ఉమ్మడి నిరసన గురించి లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో తాను మాట్లాడినట్లు ఉద్ధవ్ ఠాక్రే తెలిపారు. మహారాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కూడా ఇందులో పాల్గొంటారని చెప్పారు. ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తోందని, అయితే విద్యార్థులు ఇకపై ఎవరికీ భయపడరని అన్నారు. 'విద్యార్థులపై దాడి చేసి, మహిళా నిరసనకారుల దుస్తులు చించిన పోలీసుల బాధ్యతను ప్రధానమంత్రి తీసుకుంటారా?' అని ప్రశ్నించారు.మరోవైపు ఈ నిరసన ర్యాలీ శివాజీ పార్క్ నుంచి ప్రారంభమై సిద్ధివినాయక ఆలయం వద్ద ముగుస్తుందని రాజ్ ఠాక్రే తెలిపారు. ఈ నిరసన సందర్భంగా ఎలాంటి రాజకీయ జెండాలను ప్రదర్శించబోమని చెప్పారు. విద్యార్థుల ఆందోళన భారీ స్థాయికి చేరడంతో ప్రభుత్వం వెనకడుగు వేసిందని విమర్శించారు. 'జూలై 26న ముంబైలో మా శాంతియుత నిరసనకు భంగం కలిగించడానికి ప్రయత్నించే ఎవరినైనా మేం చితకబాదుతాం' అని ఆయన హెచ్చరించారు.

ఫాం పాండ్‌ల నిర్మాణాలతో భూగర్భ జలాలు పెంపు : జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



కుభీర్ : రైతులు తమ పంట క్షేత్రాలలో ప్రతి వర్షపు చుక్కను ఒడిసి పట్టేందుకుగాను ఫామ్ పాండ్ల ను నిర్మించుకోవాలని కలెక్టర్ భవేష్ మిశ్రాపిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లా కుభీర్ మండలం డోదర్న గిరిజన గ్రామంలో గురువారం ఆయన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి గోరేఖ సంతోష్ సాగర రైతు క్షేత్రంలో ఫాం పాండ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో ప్రస్తుత పరిస్థితుల్లో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నందున ప్రతి నీటిబొట్టును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు తమ పంట క్షేత్రాలు, బోరు బావుల వద్ద ఇంకుడు గుంతలను నిర్మించుకుని భూగర్భ జలాల పెంపునకు నడుం బిగించాలని అన్నారు.ఫాం పాండ్ల నిర్మాణానికి ముందుకు వచ్చిన రైతు దంపతులను శాలువాతో సత్కరించారు. భూగర్భ జలాల పెరుగుదలకు మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో విజయలక్ష్మి, ఎంపీడీవో అక్కల్దేవి శ్రీనివాస్, ఏపీడీ ప్రసాద్, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీవో భీమేష్, ఏపీవో రాథోడ్ హరిలాల్, టీఏలు, ఆయా శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

అసోంలో ఎడతెగకుండా కురుస్తున్న వర్షాలు.. 41కి చేరిన మరణాలు

అసోం లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు తీవ్ర వినాశనాన్ని సృష్టిస్తున్నాయి. నదులన్నీ ఉగ్రరూపం దాల్చి ప్రమాద హెచ్చరిక స్థాయిలను దాటి ప్రవహిస్తున్నాయి. రాష్ట్రంలో వరద పరిస్థితి అత్యంత విషమంగా మారింది. వేలాది మంది ఇళ్లను వదిలి దిక్కుతోచని స్థితిలో చిక్కుకుపోయారు. అసోం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. గడిచిన 24 గంటల్లోనే నలుగురు చిన్నారులతో సహా 10 మంది ప్రాణాలు కోల్పోయారు. దాంతో ఈ వర్షాలు, వరదల కారణంగా సంభవించిన మొత్తం మరణాల సంఖ్య 41కి చేరుకుంది. తాజా మరణాల్లో శివసాగర్ జిల్లాలో ముగ్గురు, జోర్హాట్‌లో ముగ్గురు, చరైడియో జిల్లాలో ఇద్దరు, ధేమాజీ, కర్బీ అంగ్లాంగ్ జిల్లాల్లో ఒకరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు. వీరితోపాటు మరో ముగ్గురు పురుషులు, ముగ్గురు మహిళలు సహా మొత్తం ఆరుగురు వరద నీటిలో కొట్టుకుపోయి గల్లంతయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 11 జిల్లాల్లోని 40 రెవెన్యూ సర్కిళ్ల పరిధిలోని దాదాపు 939 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. మొత్తం 6.53 లక్షలకుపైగా ప్రజలు ఈ వరదల దాటికి తీవ్రంగా ప్రభావితమయ్యారు. బ్రహ్మపుత్ర నదితోపాటు దాని ఉపనదులు పొంగిపొర్లుతున్నాయి.నంగ్లామురాఘాట్ వద్ద 'దిసాంగ్' నది తన ఆల్-టైమ్ రికార్డు స్థాయి ప్రమాదకర మట్టాన్ని దాటి ప్రవహిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.



గోదావరి జిల్లాల్లో ఎవరి లెక్కలు వారివి

కాకినాడ, జూలై 23, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు గుండెకాయ లాంటి ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అధికార కూటమి పచ్చని సంసారంలో స్థానిక సంస్థల ఎన్నికల సెగలు రేపుతోంది. రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మధ్య మైత్రి ఫెవికాల్ బంధంలా అత్యంత బలంగా కనిపిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయికి వచ్చేసరికి సీన్ పూర్తిగా మారుతోంది. సార్వత్రిక ఎన్నికల నాటి త్యాగాలు, సర్దుబాట్లు ఒకెత్తయితే.. ఇప్పుడు ముంచుకొస్తున్న స్థానిక సంస్థల సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల వేళ ఏ గ్రామానికి ఆ గ్రామంలో సీట్ల పంచాయితీ ముదిరిపాకాన పడుతోంది. పొత్తుల రొంపిలో ఇరు పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు, అటు తమ్ముళ్లు, ఇటు జనసైనికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.ముఖ్యంగా పిఠాపురం, భీమవరం, అమలాపురం నియోజకవర్గాల అంతర్గత గ్రామాల్లో టీడీపీ-జనసేన లీడర్ల మధ్య నడుస్తున్న కోల్డ్ వార్ ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా రచ్చకెక్కుతోంది. పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని పల్లెల్లో ప్రెసిడెంట్ సీటు ఎవరిదనే దానిపై హోరాహోరీ పోరు సాగుతోంది. గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ వేధింపులను తట్టుకుని, కేడర్‌ను కాపాడుకుంటూ వచ్చిన స్థానిక టీడీపీ నేతలు.. ఎమ్మెల్యే సీటునే జనసేనకు త్యాగం చేశాం, కనీసం ఊరి సర్పంచ్ సీటైనా మాకు ఇవ్వకపోతే ఎలా అని గట్టిగా నిలదీస్తున్నారు. మరోవైపు, తమ అధినేత నియోజకవర్గం కాబట్టి మెజారిటీ గ్రామాలు తమకే దక్కాలని జనసైనికులు పట్టుబడుతుండటంతో అంతర్గత వర్గపోరు పీక్స్‌కు చేరింది.పశ్చిమ గోదావరి కేంద్రమైన భీమవరంలోనూ ఇదే తరహా ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ఏ గ్రామంలో ఏ పార్టీ వార్డు దక్కించుకోవాలి? ఎవరికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి? అనే అంశంపై ప్రతి ఊరిలోనూ రచ్చబండ పంచాయితీలు జరుగుతున్నాయి. ఉమ్మడి వేదికలపై పైకి నవ్వుతూ షేక్‌హ్యాండ్‌లు ఇచ్చుకుంటున్న స్థానిక నేతలు.. లోపల మాత్రం ఎవరికి వారు గ్రూపు రాజకీయాలు నడుపుతున్నారు. ఒకరు పిలిచిన కార్యక్రమాలకు మరొకరు డుమ్మా కొట్టడం, లోకల్ వాట్సాప్ గ్రూపుల్లో పరోక్ష విమర్శలతో పోస్టులు పెట్టుకోవడం వంటి పరిణామాలు క్షేత్రస్థాయిలో అసంతృప్తికి అద్దం పడుతున్నాయి. అమలాపురం రూరల్ పరిధిలో సమీకరణాలు మరింత క్లిష్టంగా మారాయి. ఇక్కడ సామాజిక వర్గాల ఈక్వేషన్లు ఎప్పుడూ హాట్ టాపిక్కే. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ.. నిధుల కేటాయింపులు, గ్రామీణ పనుల కాంట్రాక్టుల విషయంలో టీడీపీ, జనసేన ద్వితీయ శ్రేణి నేతల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా క్షేత్రస్థాయిలో మాకు

సరైన ప్రాధాన్యత దక్కడం లేదు అనే గుబులు జనసేన కిందిస్థాయి లీడర్లలో కనిపిస్తుంటే.. మెజారిటీ ఓటు బ్యాంకు మాదే, సీట్ల కేటాయింపులో సింహభాగం మాకే దక్కాలి అని తమ్ముళ్లు వాదిస్తున్నారు. ఈ పట్టువిడుపులు లేని ధోరణి ఉమ్మడి జిల్లాల అంతటా కూటమి సమన్వయాన్ని దెబ్బతీస్తోంది.అసెంబ్లీ సీట్ల సర్దుబాటు కంటే స్థానిక సంస్థల సీట్ల సర్దుబాటే చంద్రబాబు-పవన్ కళ్యాణ్‌లకు అసలైన పరీక్ష అని చెబుతున్నారు. ఎందుకంటే ఎమ్మెల్యే సీటు అనేది నియోజకవర్గానికి ఒక్కటే ఉంటుంది కాబట్టి నచ్చజెప్పడం సులువు. కానీ, వేలాదిగా ఉండే వార్డులు, వందలాదిగా ఉండే సర్పంచ్ స్థానాల్లో ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా సదరు లీడర్ రెబెల్‌గా మారే ప్రమాదం ఉంది లేదా పక్కనే పొంచి ఉన్న విపక్ష వైఎస్సార్‌సీపీకి లాభం చేకూర్చే అవకాశం ఉంది. గోదావరి జిల్లాల్లో ఏ మాత్రం తేడా వచ్చినా అది రాష్ట్ర వ్యాప్త కూటమి గ్రాఫ్‌పై ప్రభావం చూపిస్తుంది. ముగింపుగా చెప్పాలంటే.. గోదావరి జిల్లాల గ్రామాల్లో తమ్ముళ్లు, సైనికుల మధ్య సాగుతున్న ఈ సీట్ల పంచాయితీని అధిష్టానం ఎంత త్వరగా సెటిల్ చేస్తే అంత మంచిది. పైస్థాయిలో ఉన్న దోస్తీ.. కిందిస్థాయి గడప దాకా చేరకపోతే, స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఉమ్మడి జిల్లాల కోటల్లో అంతర్గత తిరుగుబాట్లు తప్పవు. మరి ఈ పొత్తుల రొంపి నుంచి ఇరు పార్టీల స్థానిక లీడర్లను చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎలా గట్టెక్కిస్తారో చూడాలి.

పక్క చూపులు చూస్తున్న కన్నబాబు



విశాఖపట్టణం, జూలై 23, అనకాపల్లి జిల్లా రాజకీయాల్లో కీలక నేతగా గుర్తింపు పొందిన మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు వ్యవహారశైలి ఇటీవల మరోసారి చర్చనీయాంశంగా మారింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు ఆయన దూరంగా ఉంటుండటం, పార్టీ ముఖ్యమైన నిరసన కార్యక్రమాల్లో కూడా కనిపించకపోవడం రాజకీయ వర్గాల్లో పలు ఊహాగానాలకు కారణమవుతోంది. దీంతో ఆయన పార్టీతో కొనసాగుతున్నారా, లేక రాజకీయంగా కొత్త నిర్ణయాల వైపు అడుగులు వేస్తున్నారా అనే చర్చ సాగుతోంది.ఇటీవల ఎలమంచిలి నియోజకవర్గంలోని పంచదార్లప్రాంతంలో అక్రమ మైనింగ్ జరుగుతోందని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీ స్థాయిలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ తో పాటు ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన పలువురు సీనియర్ నాయకులు హాజరయ్యారు. అయితే మూడు సార్లు ఎలమంచిలి ఎమ్మెల్యేగా పనిచేసిన కన్నబాబురాజు ఈ కార్యక్రమంలో కనిపించకపోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.కన్నబాబురాజు గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాల్లో పెద్దగా చురుకుగా పాల్గొనడం లేదని స్థానిక రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఆయన పుట్టినరోజు వేడుకల సందర్భంగా కూడా పార్టీ నాయకుల హడావుడి కనిపించకపోవడం ఈ చర్చలకు మరింత బలం చేకూర్చింది. అయితే ఇది ఆయన రాజకీయ వ్యూహంలో భాగమని భావిస్తున్నవారూ ఉన్నారు.2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున విజయం సాధించిన కన్నబాబురాజు, 2024 ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. ఎన్నికల అనంతరం కొంతకాలం పాటు పార్టీ ఆయననే నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగించింది. అయితే తరువాత పార్టీ అధిష్టానం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కి ఆ బాధ్యతలు అప్పగించింది. ఈ నిర్ణయం తర్వాత కన్నబాబురాజు అసంతృప్తికి గురయ్యారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో వినిపించింది.ఎలమంచిలి నియోజకవర్గంలో ప్రస్తుతం పార్టీకి చెందిన రెండు వర్గాలు విడివిడిగా పనిచేస్తున్నాయని స్థానికంగా చర్చ జరుగుతోంది. ఒకవైపు కరణం ధర్మశ్రీ వర్గం కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, మరోవైపు కన్నబాబురాజు అనుచరులు కూడా తమకంటూ ప్రత్యేకంగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ఈ పరిస్థితి భవిష్యత్‌లో టికెట్ కోసం పోటీకి సంకేతంగా భావిస్తున్నారు.మరోవైపు, వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు, మాజీ డీసీసీబీ చైర్మన్ సుకుమార్ వర్మ (కు ఎమ్మెల్యే టికెట్ ఇప్పించేందుకు కన్నబాబురాజు ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. భవిష్యత్ రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ఆయన ప్రస్తుతం మౌన వ్యూహాన్ని అనుసరిస్తున్నారని కొందరు విశ్లేషిస్తున్నారు.అయితే కన్నబాబురాజు ఇప్పటివరకు పార్టీని వీడుతున్నట్లు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం కూడా ఆయనపై బహిరంగంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. అయినప్పటికీ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం, స్థానిక రాజకీయ పరిణామాల్లో మౌనం పాటించడం వంటి అంశాలు ఆయన భవిష్యత్ రాజకీయ అడుగులపై ఆసక్తిని పెంచుతున్నాయి.రానున్న రోజుల్లో ఎలమంచిలి నియోజకవర్గ రాజకీయాలు ఎలా మారతాయి, కన్నబాబురాజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతారా లేదా కొత్త రాజకీయ నిర్ణయం తీసుకుంటారా అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఆయన తదుపరి నిర్ణయం స్థానిక రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముందని పరిశీలకులు భావిస్తున్నారు.

13 మంది మంత్రులకే డేంజర్ బెల్స్

విజయవాడ, జూలై 23, ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇటీవలే రెండేళ్లు పూర్తి చేసుకుంది. గత ఎన్నికల్లో ఎవ్వరూ ఊహించని విధంగా కేవలం 11 సీట్లకు మాత్రమే పరిమితం అయిన వైఎస్సార్‌సీపీ అసలు ఇప్పట్లో పుంజుకుంటుందా ? ఆ పార్టీ కేడర్ రోడ్డెక్కుతారా ? అన్న సందేహాలు అందరిలోనూ కలిగాయి. కానీ ఆశ్చర్యంగా రెండేళ్లకే ఆ పార్టీ నాయకత్వం ఇస్తోన్న పిలుపునకు వైసీపీ కేడర్ ఉత్సాహంగా రోడ్లెక్కేస్తున్నారు. వైసీపీ ఇంత త్వరగా కోలుకుని మూడు పార్టీల కూటమి ప్రభుత్వంతో ఢీ అంటే ఢీ అనే పరిస్థితి వస్తుందని ఎవ్వరూ ఊహించి ఉండరు. దీనికి చాలా కారణాలు, తప్పులు కనిపిస్తున్నాయి. ఎమ్మెల్యేల ఇష్టారాజ్యం అయిపోయింది. ఎమ్మెల్యేలు ఎవ్వరూ ముఖ్యమంత్రి లేదా తమ పార్టీ అధినేతలు చెప్పినట్టు వినే పరిస్థితి లేదు. ఈ విషయంలో పరిస్థితి చేయిదాటిపోయింది. చంద్రబాబు గతానికి భిన్నంగా ఈ సారి తన కేబినెట్లో కొత్త వాళ్లకు అవకాశం ఇచ్చారు. వాళ్లలో ఎక్కువ మంది తొలిసారి అసెంబ్లీకి ఎన్నికైన వారు కూడా ఉన్నారు. వీళ్లు తమ శాఖల పరంగా పట్టు సాధించడంలోనూ , ఇటు పార్టీకి ఉపయోగపడడంలోనూ దారుణంగా విఫలమవుతున్నారు. తెలుగుదేశం నుంచి కేబినెట్ మంత్రులుగా ఉన్న వారిలో ఏకంగా 13 మంది కొత్తవాళ్లే ఉన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇదే కేబినెట్‌తో చంద్రబాబు ఎన్నికలకు వెళితే ఖచ్చితంగా ఇబ్బందులు తప్పవని పార్టీలో సీనియర్ నాయకులు తమ అంతర్గత చర్చల్లో సంభాషించుకుంటున్నారు. శాఖలకు మంత్రులుగా ఎవరు ఉన్నా .. జిల్లాల పరంగా పవర్ ఫుల్ వ్యక్తులు లేకపోతే ఖచ్చితంగా అది ఎన్నికలపై, జిల్లా అభివృద్ధిపై ప్రభావం చూపుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎన్నికలకు మరో మూడేళ్ల టైం కూడా లేదు.. అందుకే డైనమిక్‌గా ఉండేవాళ్లకే కేబినెట్లో చోటు కల్పించాల్సిన అవసరం ఉంది. కేబినెట్లో ఉన్న మంత్రుల్లో ఎక్కువ మంది మంత్రుల పనితీరుపై కూడా చంద్రబాబు, లోకేష్ ఇద్దరూ ఎంతమాత్రం సంతృప్తిగా లేరని అంటున్నారు. దసరాకు కాస్త అటూ ఇటూగా కేబినెట్లో మార్పులు, చేర్పులు ఉండవచ్చని అంటున్నారు. ఫస్ట్ టైం ఛాన్స్ మిస్ అయ్యిన వారికి రెండో విడతలో ఖచ్చితంగా ఛాన్స్ ఇస్తారని అంటున్నారు.తొలిసారి కేబినెట్లో చోటు దక్కించుకున్న వాళ్లలో అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్, మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, సుభాష్, సవిత, టి జి భరత్, బి సి జనార్దన్ రెడ్డి , నిమ్మల రామానాయుడు, గుమ్మడి సంధ్యా రాణి, డోలా బాల వీరాంజనేయ స్వామి ఉండగా.. వీరిలో సగానికి పైగా మంత్రుల పనితీరు అసలు ఏ మాత్రం బాగోలేదంటున్నారు. విచిత్రం ఏంటంటే సీనియర్ ఎమ్మెల్యేలు మంత్రులుగా ఉన్నచోట కూడా ఆరోపణలు వస్తున్నాయి. రెవెన్యూ, విద్యుత్ శాఖ, ఆర్థికశాఖలపై కూడా ప్రజల్లోనూ, ప్రభుత్వ వర్గాల్లో అంత సంతృప్తి లేదంటున్నారు ఇక అన్నింటింకి మించి కూటమి ప్రభుత్వంలో బిల్స్ వైసీపీ నేతలు చెప్పిన వాళ్లకు క్లీయర్ అవుతున్నాయన్నది బయటకు వచ్చేసింది. టీజీ భరత్ వివాద రహితుడే అయినా ఆయన శాఖ ఆయన చేతుల్లో లేదంటున్నారు. రాష్ట్రానికి ఏ పరిశ్రమ, పెట్టుబడి వచ్చినా అది లోకేష్ ఖాతాలోకి వెళ్లిపోతోంది.

మొన్న దువ్వాడ, నిన్న సిదిరి.. ఇవాళ తమ్మినేని

శ్రీకాకుళం, జూలై 23, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా (ఒకప్పుడు తెలుగుదేశం పార్టీ)కి బలమైన ప్రాంతంగా గుర్తింపు పొందింది. 2019 ఎన్నికల్లో మాత్రం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించినప్పటికీ, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. టీడీపీ కూటమి ఉమ్మడి జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలను గెలుచుకుని క్లీన్ స్వీప్ చేసింది. దీంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లాలో తిరిగి బలం పెంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.2024 ఎన్నికల తర్వాత జిల్లాలో వైసీపీ పార్టీని సమన్వయం చేసే బలమైన నాయకత్వం లేకపోవడం, అంతర్గత విభేదాలు, వర్గ రాజకీయాలు పార్టీ పునర్నిర్మాణానికి అడ్డంకిగా మారుతున్నాయి. ఇదే సమయంలో కీలక నేతలు వివిధ కారణాలతో వార్తల్లో నిలవడం కూడా పార్టీకి ఇబ్బందికర పరిస్థితులను తీసుకొస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఇటీవల మాజీ స్పీకర్, మాజీ మంత్రి తమ్మినేని సీతారాం



పేరు భూ వివాదానికి సంబంధించిన కేసులో రావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. సుమారు రూ.4 కోట్ల విలువైన భూమికి సంబంధించిన వ్యవహారంలో అక్రమ రిజిస్ట్రేషన్ జరిగిందనే ఆరోపణలపై కేసు నమోదైనట్లు సమాచారం. ఈ ఆరోపణలను చట్టపరమైన విచారణలో అధికారులు పరిశీలిస్తున్నారు. కేసుకు సంబంధించి తమ్మినేని సీతారాం లేదా ఆయన కుటుంబం నుంచి పూర్తి స్థాయి స్పందన రావాల్సి ఉంది. కాబట్టి ఆరోపణలు ఇప్పటికీ న్యాయపరమైన విచారణ దశలోనే ఉన్నాయిఈ పరిణామాల నేపథ్యంలో తమ్మినేని సీతారాం రాజకీయ భవిష్యత్తుపై కూడా చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఆయన శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. భవిష్యత్‌లో లోక్‌సభ (ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్నారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అలాగే ఆయన కుమారుడు తమ్మినేని చిరంజీవి నాగ్ ను ఆముదాలవలస (అసెంబ్లీ స్థానం నుంచి బరిలోకి దించాలని కుటుంబం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సమయంలో భూ వివాదం రాజకీయంగా ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎదురవుతున్న సవాళ్లు ఒక్క తమ్మినేని సీతారాంతోనే పరిమితం కాలేదు. టెక్కలి ప్రాంతానికి చెందిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వ్యక్తిగత వివాదాల నేపథ్యంలో పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు. మరోవైపు పలాస మాజీ మంత్రి సీదరి అప్పలరాజు కుటుంబం కూడా ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాద ఘటనతో వార్తల్లో నిలిచింది. ఈ పరిణామాలు జిల్లాలో పార్టీ నాయకత్వంపై ప్రభావం చూపుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీని క్షేత్రస్థాయిలో మళ్లీ బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు. 2024 ఎన్నికల పరాజయం నుంచి పూర్తిగా కోలుకుని కార్యకర్తల్లో నమ్మకం పెంచడం, కొత్త వ్యూహాలతో ముందుకు సాగడం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కీలక సవాలుగా మారింది.అయితే రాజకీయ పరిస్థితులు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి. ప్రస్తుతం ఎదురవుతున్న ఇబ్బందులను పార్టీ ఎలా అధిగమిస్తుంది, జిల్లాలో తిరిగి తన బలాన్ని ఎలా పెంచుకుంటుంది, కీలక నాయకులు తమపై వచ్చిన వివాదాలను ఎలా ఎదుర్కొంటారు అన్నదే రానున్న రోజుల్లో శ్రీకాకుళం జిల్లా రాజకీయాల దిశను నిర్ణయించే ప్రధాన అంశంగా మారనుంది.

దసరా నుంచి వందే భారత్ స్లీపర్



విజయవాడ, జూలై 23, ఏపీ ప్రజలకు భారీ గుడ్ న్యూస్. రైల్వేశాఖ సూపర్ న్యూస్ అందించనుంది. ఏపీ మీదుగా వందే భారత్ స్లీపర్ రైళ్లను నడిపేందుకు కసరత్తులు చేస్తోంది. విజయవాడ డివిజన్ మీదుగా ఏపీలో తొలి వందే భారత్ స్లీపర్ రైలును ప్రవేశపెట్టాలని నిర్ణయం తీసుకుంది. దేశంలో తొలి స్లీపర్ రైలును ఈ ఏడాది జనవరిలో హౌరా-గువహతి మధ్య రైల్వేశాఖ ప్రవేశపెట్టింది. ప్రధాని మోదీ స్వయంగా దీనిని పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ప్రస్తుతం ఏపీ మీదుగా సాధారణ వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం, తిరుపతి వరకు, కాచిగూడ నుంచి బెంగళూరు, నర్సాపురం నుంచి చెన్నైకు రైళ్లు నడుస్తున్నాయి. అయితే స్లీపర్ రైళ్ల లేకపోవడంతో ఇప్పుడు వాటిని కూడా తీసుకొచ్చేందుకు రైల్వేశాఖ ప్రయత్నాలు చేస్తోంది.దసరా నాటికి విజయవాడ మీదుగా వందే భారత్ స్లీపర్ రైలు అందుబాటులోకి తీసుకురావాలని రైల్వేశాఖ సన్నాహాలు చేస్తోంది. విశాఖపట్నం నుంచి బెంగళూరు, విజయవాడ నుంచి బెంగళూరు మధ్య ఈ రైళ్లను నడిపేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఇక విజయవాడ నుంచి అయోధ్య, విజయవాడ నుంచి ఢిల్లీకి నడిపితే బాగుంటుందని మరికొంతమంది ప్రతిపాదిస్తున్నారు. దీంతో ఏ రూట్లో అనేది క్లారిటీ లేనప్పటికీ.. దసరా నాటికి ఏపీలో తొలి వందే భారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కనుందని తెలుస్తోంది. వందే భారత్ స్లీపర్ రైళ్లల్లో అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. మెరుగైన కుషనింగ్, లేటెస్ట్ ఇంటీరియల్స్, ఇంటర్నెట్, ఛార్జింగ్ పాయింట్లు, ఆటోమేటిక్ డోర్లు, ఎల్ఈడీ డోర్లు, ఎల్ఈడీ లైట్లు, సౌండ్ ప్రూఫ్, ప్రత్యేక సెన్సార్లు వంటివి ఉన్నాయి. విమానం తరహాలోనే అత్యాధునిక సౌకర్యాలు ఉంటాయి.వందే భారత్ స్లీపర్ రైళ్లు గంటకు 160 నుంచి 180 కిలోమీర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఇందులో ఫస్ట్, సెకండ్, థర్డ్ ఏసీ బోగీలు ఉంటాయి. ఇప్పటికే ప్రారంభమైన హౌరా-గువహతి తొలి వందే భారత్ స్లీపర్ రైలులో మొత్తం 16 కోచ్‌లు ఉన్నాయి. ఈ ట్రైన్లో కనీస ఛార్జి రూ.960 నుంచి ప్రారంభమవుతుంది. అయితే స్లీపర్ రైళ్లల్లో ఆర్ఏసీ, వెయిటింగ్ లిస్ట్ వంటివి ఉండవు. కన్ఫార్మ్‌డ్ టికెట్ ఉన్నవారిని మాత్రమే ప్రయాణానికి అనుమతిస్తారు. వీటిల్లో సౌండ్ ప్రూఫ్ సిస్టమ్ ఉండటంతో ఎలాంటి సౌండ్స్, కుదుపులు అనేవి ఉండవు. దీంతో రాత్రి సమయంలో ప్రశాంతంగా ప్రయాణం చేయవచ్చు. అటు సికింద్రాబాద్-ఢిల్లీ రూట్లో కూడా వందే భారత్ స్లీపర్ రైలు తీసుకురావాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ప్రయత్నాలు చేస్తోంది.

స్థానిక ఎన్నికల్లో వైసీపీకి చావుదెబ్బ.. కూటమి ప్లాన్ అదుర్స్

విజయవాడ, జూలై 23, కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. స్థానిక ఎన్నికల నిర్వహణకు సిద్ధపడుతోంది. సాధారణంగా పంచాయతీ ఎన్నికలు అనేవి ముందుగా జరపడం సహజం. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం మున్సిపల్ ఎన్నికల వైపు మొగ్గు చూపింది. ముందుగా పట్టణాల్లో ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించింది. దీని వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. 100కు పైగా మున్సిపాలిటీలు, 12 కార్పొరేషన్లను కైవసం చేసుకుని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని కోలుకోలేని దెబ్బతీయాలన్నది కూటమి ప్రణాళికగా తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాలతో పోల్చుకుంటే పట్టణ ప్రాంతాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చాలా బలహీనంగా ఉంది. అందుకే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చావు దెబ్బ తీసేందుకు ముందుగా మున్సిపల్ ఎన్నికల వైపు కూటమి అడుగులు వేస్తోంది. మున్సిపల్ ఎన్నికల తర్వాత ప్రాదేశిక.. చివరిగా పంచాయితీ ఎన్నికలు నిర్వహించాలన్నది ప్రణాళికగా తెలుస్తోంది.పట్టణాల్లో విద్యాధికులు, ఉద్యోగ ఉపాధ్యాయులు అధికంగా ఉంటారు. అయితే వారిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల ఒక రకమైన వ్యతిరేక భావన ఉంది. పైగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విధానాలు కూడా పట్టణ ప్రాంత ప్రజలకు నచ్చడం లేదు. ఆ పార్టీ నేతలు చేస్తున్న ప్రకటనలు కూడా మింగుడు పడడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో గతంలో సంక్షేమ పథకాలు అమలు చేయడం వంటి కారణాలతో వైసిపికి ఓటు బ్యాంకు స్థిరంగా ఉంది. ఆపై స్థానిక సంస్థలకు సంబంధించిన ప్రజాప్రతినిధులు ఇటీవల వరకు కొనసాగారు. వారు పట్టు నిలుపుకుంటూ వచ్చారు. అందుకే ముందుగా పంచాయితీలకు ఎన్నికలు నిర్వహిస్తే కూటమికి కాస్త ఇబ్బందికరంగా ఉండే అవకాశం ఉంది. పైగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలు అనే మాట ఉండకూడదు అని జగన్ సొంత పార్టీ క్యాడర్ను హెచ్చరించారు. అలా చేస్తే పార్టీ నియోజకవర్గ బాధ్యతలను మార్చేస్తానంటూ ఇంచార్జ్‌ను హెచ్చరించారు. అందుకే ముందుగా మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించి తర్వాత మిగతా స్థానిక సంస్థలకు నిర్వహించాలన్నది కూటమి ప్రభుత్వ ఆలోచనగా అర్థం అవుతుంది.పట్టణాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉండడంతో ఆ పార్టీకి ఇబ్బందికర పరిస్థితులు రావడం ఖాయం. పైగా మూడు పార్టీల కలయికతో కూటమి దూకుడుగా ఉంటుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో జత కలిపేందుకు ఏ పార్టీ ముందుకు రాదు. పైగా మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ అనుసరించిన తీరు ఆ పార్టీ శ్రేణులకు తెలుసు. అధికార పార్టీ ఎలాంటి దూకుడు కనబరుస్తుందో ఆ పార్టీకి తెలియంది కాదు.. అందుకే ముందుగా మున్సిపల్ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని చావు దెబ్బ కొట్టి.. మిగతా ప్రాదేశిక ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోంది కూటమి. చివరిగా గ్రామీణ ప్రాంతాలకు ప్రతీకలుగా నిలిచే పంచాయితీలను ఏకపక్షంగా గెలుచుకొని.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పుంజుకునే పరిస్థితి లేకుండా చేయాలన్నది కూటమి ఆలోచన. అందుకే ముందుగా మున్సిపల్ ఎన్నికల వైపు ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్ నుంచి డిసెంబరు లోపు మొత్తం స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలన్నది ప్రభుత్వ ఆలోచనగా అర్థం అవుతుంది. చూడాలి మరి ఏం జరుగుతుందో??

స్పోర్ట్స్ న్యూస్

కావ్యపాప కొంపముంచిన పాక్ స్పిన్నర్: నమ్ముకుంటే ఇచ్చిపడేశాడుగా!

ది హండ్రెడ్ లీగ్ 2026 సీజన్ తొలి మ్యాచ్‌లోనే కావ్య మారన్ యాజమాన్యంలోని సన్‌రైజర్స్ లీడ్స్ జట్టుకు చేదు అనుభవం ఎదురైంది. ఎంఐ లండన్ జట్టుతో జరిగిన ఈ ఆరంభ పోరులో సన్‌రైజర్స్ లీడ్స్ 7 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. టాస్ గెలిచి మొదట బౌలింగ్ ఎంచుకున్న ఎంఐ లండన్ జట్టును ప్రత్యర్థిని కట్టడి చేయడంలో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ లీడ్స్ 99 బంతుల్లో 143 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. అనంతరం లక్ష్యఛేదనలో ఎంఐ లండన్ జట్టు కేవలం 84 బంతుల్లోనే 3 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఎంఐ లండన్ కెప్టెన్ సామ్ కరణ్ 60 పరుగుల ఇన్నింగ్స్ ఆడగా.. నికోలస్ పూరన్ 22 బంతుల్లో 58 పరుగులు చేసి జట్టుకు 16 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని అందించాడు.ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ లీడ్స్ జట్టుకు ఓపెనర్లు మిచెల్ మార్ష్(41 పరుగులు), ర్యాన్ రికెల్టన్(25 పరుగులు) మంచి ఆరంభాన్ని అందించారు. దీని తర్వాత హ్యారీ బ్రూక్ కేవలం 8 పరుగులు మాత్రమే చేయగలిగాడు. కాగా జాక్ క్రాలీ 11 బంతుల్లో 29 పరుగులు చేశాడు. టామ్ ఆల్సాప్ 18 బంతుల్లో 31 పరుగుల ఇన్నింగ్స్ ఆడి జట్టును 143 పరుగులకు చేర్చాడు. ఎంఐ లండన్ తరఫున రిచర్డ్ గ్లీసన్ 19 బంతుల్లో 4 వికెట్లు పడగొట్టగా.. సామ్ కరన్‌కు 2 వికెట్లు, రషీద్ ఖాన్‌కు ఒక వికెట్ లభించాయి.144 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో, ఎంఐ లండన్ పేలవమైన ఆరంభాన్ని అందుకుంది. విల్ జాక్స్ కేవలం 2 పరుగులకే ఔటవ్వగా.. జేమ్స్ విన్స్ పరుగులేమీ చేయకుండానే నిష్క్రమించాడు. ఆ తర్వాత సామ్ కరన్, నికోలస్ పూరన్ సన్‌రైజర్స్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. సిక్సర్లు, ఫోర్ల వర్షం కురిపిస్తూ వారు ఓ అద్భుతమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పి, 16 బంతులు మిగిలి ఉండగానే తమ జట్టుకు విజయాన్ని అందించారు.ఈ మ్యాచ్ లో కావ్యమారన్ జట్టు తరఫున పాకిస్థానీ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ అరంగేట్రం చేశాడు. అయితే అబ్రార్ అహ్మద్ అరంగేట్రం అతనికి ఏ మాత్రం కలిసిరాలేదు. ఇంతలో 70 బంతుల తర్వాత బౌలింగ్‌కు వచ్చిన అబ్రార్ అహ్మద్ ఒకే ఓవర్‌లో 3 సిక్సర్లు సమర్పించుకున్నాడు. సామ్ కరన్ మొదటి బంతిని మిడ్‌వికెట్ మీదుగా సిక్సర్‌గా బాదాడు. ఆ తర్వాత 74వ, 75వ బంతులకు నికోలస్ పూరన్ వరుసగా రెండు సిక్సర్లు, ఒకటి స్ట్రెయిట్‌గా, మరొకటి డీప్ బ్యాక్‌వర్డ్ పాయింట్‌కు, బాది విజయాన్ని ఖాయం చేశాడు. పూరన్ 19 బంతుల్లోనే తన అర్ధశతకాన్ని పూర్తి చేసుకుని, 84వ బంతికి ఎంఐ లండన్‌కు 7 వికెట్ల విజయాన్ని ఖాయం చేశాడు. ఈ మ్యాచ్‌ను చూసేందుకు హాజరైన టీమిండియా స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ కూడా వీరి హిట్టింగ్‌ను ఎంతో ఆస్వాదించాడు.



ఐపీఎల్ పితామహుడికిడి వీడిన 16 ఏళ్ల గ్రహణం- త్వరలో భారత్ రాక

ఐపీఎల్ వ్యవస్థాపకుడు, మొట్ట మొదటి ఛైర్మన్ లలిత్ మోదీ త్వరలోనే తిరిగి భారత్ కు రానున్నారు. సుదీర్ఘ కాలంగా వేధిస్తూ వస్తోన్న ఫెమా కేసులో ఆయనకు భారీ ఊరట లభించింది. ఈ నేపథ్యంలో ఆయన భారత్‌కు తిరిగి వచ్చేందుకు మార్గం సుగమమైంది. దాదాపు 16 ఏళ్ల తర్వాత ఆయన స్వదేశీ గడ్డపై అడుగు పెట్టనున్నారు. ఇన్నేళ్ల తర్వాత తనపై వచ్చిన ఆరోపణలు తప్పని రుజువయ్యాయని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆయన లండన్ లో నివసిస్తోన్నారు. లలిత్ మోదీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్మోపిన కేసులను విచారించిన సఫెమా 2009లో దక్షిణాఫ్రికాలో జరిగిన ఐపీఎల్ రెండో సీజన్ నిధుల బదిలీకి సంబంధించిన కేసులో ఈడీ విధించిన జరిమానాలు, ఇతర కీలక అభియోగాలను ట్రిబ్యునల్ కొట్టివేసింది. ఈ పరిణామంతో లలిత్ మోదీకి ఉన్న ప్రధాన చట్టపరమైన అడ్డంకులు దాదాపుగా తొలగిపోయాయి. ట్రిబ్యునల్ ఇచ్చిన ఈ తీర్పుపై లలిత్ మోదీ స్పందించారు. లండన్ నుంచి ఓ వీడియోను విడుదల చేశారు. ఈ తర్పు తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని వ్యాఖ్యానించారు. 16 ఏళ్లుగా నిజాయితీని నిరూపించుకోవడానికి పోరాడుతున్నానని, చివరకు నిజమే గెలిచిందని ఆనందం వ్యక్తం చేశారు. మీడియాకు, సాధారణ ప్రజలకు తాను మొదటి నుంచి చెబుతున్న మాటలే నేడు నిజమని తేలిపోయాయని వివరించారు. తాను ఎప్పుడూ ఐపీఎల్ శ్రేయస్సు కోసమే పనిచేశానని, లీగ్ అభివృద్ధి తప్ప తనకు మరో స్వార్థం లేదని స్పష్టం చేశారు. నిండు సభలో అఖిలేష్ నిప్పులు ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలో తాను తిరిగి స్వదేశానికి వస్తానని లలిత్ మోదీ వెల్లడించారు. అక్టోబర్ లో తన కుమార్తె ప్రసవించనుందని, మనవడితో కలిసి నూతన జీవితాన్ని ప్రారంభిస్తానని ఆయన తెలిపారు. ఆ కుటుంబ వేడుకల అనంతరం అంతా మంచే జరుగుతుందని, త్వరలోనే స్వదేశంలో అడుగుపెడతానని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఖనీలివతీవట ఃఎ గతంలో చట్టపరమైన ఇబ్బందుల వల్ల దేశం విడిచి లండన్ కు వెళ్లిన లలిత్ మోదీ.. ఇప్పుడు మళ్లీ భారత్‌లోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. 2009లో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఐపీఎల్ రెండో సీజన్‌ను భారత్ నుంచి దక్షిణాఫ్రికాకు తరలించాల్సి వచ్చింది. ఆ సమయంలో ఫెమా ఉల్లంఘించి భారీ మొత్తంలో నిధుల అవకతవకలకు పాల్పడ్డారంటూ లలిత్ మోదీతో పాటు బీసీసీఐ అధికారులపై కూడా ఈడీ తీవ్రమైన అభియోగాలు మోపింది. వీటిని సఫెమా ట్రిబ్యునల్ కొట్టివేసింది. సుదీర్ఘ కాలంగా లండన్‌లో ప్రవాస జీవితం గడుపుతున్న లలిత్ మోదీ పునరాగమనం భారత వ్యాపార, క్రీడా రంగాల్లో సరికొత్త చర్చకు దారితీస్తోంది. ఆయనపై ఉన్న ప్రధానమైన న్యాయపరమైన వివాదం ఒక కొలిక్కి రావడంతో, మోదీ తదుపరి అడుగులు ఎలా ఉండబోతున్నాయనేది ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. పాత అధ్యాయం ముగిసిపోవడంతో తన జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభం కానుందని లలిత్ మోదీ ధీమా వ్యక్తం చేశారు.



కామన్‌వెల్త్ క్రీడల్లో బాక్సర్ లవ్లీనాకు పతకం ఖాయం

గ్లాస్‌గోవ్: కామన్‌వెల్త్ క్రీడల్లో భారత్‌కు అప్పుడే ఓ పతకం ఖాయమైంది. మహిళల 75 కేజీల విభాగంలో బాక్సర్ లవ్లీనా బోర్గోహెయిన్‌కు పతకం దక్కనున్నది. దీంతో గ్లాస్‌గోవ్ క్రీడల్లో భారత్‌కు తొలి పతకం దాదాపు ఖాయమైంది. బాక్సింగ్‌లో లవ్లీనా సెమిఫైనల్లోకి ఎంట్రీ ఇచ్చింది. క్వార్టర్ ఫైనల్స్‌లో ఆమెకు బై దక్కింది. దీంతో ఆమె నేరుగా సెమిస్‌కు వెళ్లింది. జూలై 31వ తేదీన జరగనున్న సెమిస్‌లో తాఫకితో ఆమె తలపడుతుంది.ఒకవేళ సెమిస్‌లో ఓడినా.. లవ్లీనాకు మాత్రం కనీసం కాంస్య పతకం దక్కనున్నది. కామన్‌వెల్త్ క్రీడల్లో ఇంకా ఓపెనింగ్ సెర్మనీ కూడా జరగకముందే ఇండియాకు పతకం ఖాయం కావడం గమనార్హం. రింగ్‌లోకి ఎంటర్ కాకముందే ఆమెకు పోడియంలో చోటు దక్కిందని అధికారులు పేర్కొన్నారు. ఈసారి ఇండియా తరపున కామన్‌వెల్త్ క్రీడల్లో 124 మంది అథ్లెట్లు హాజరవుతున్నారు. 2022లో జరిగిన క్రీడల్లో ఇండియా ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన విషయం తెలిసిందే.



డోప్‌లో జూడో ప్లేయర్‌కు పాజిటివ్.. కామన్‌వెల్త్ నుంచి అరుణ్ కుమార్ ఔట్



గ్లాస్‌గోవ్: కామన్‌వెల్త్ క్రీడల్లో ఇండియాకు జలక్ తగిలింది. జూడో ప్లేయర్ అనుణ్ కుమార్‌కు డోప్ నోటీసలు ఇచ్చారు. డోప్ పరీక్షలో ఉత్ప్రేరకాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు. దీంతో కామన్‌వెల్త్ క్రీడల నుంచి అరుణ్ కుమార్‌ను తప్పించారు. పురుషుల 73 కిలోల విభాగంలో అరుణ్ కుమార్ పోటీపడాల్సి ఉంది. కానీ డోప్ పరీక్షలో పాజిటివ్ రావడంతో అతన్ని అనర్హుడిగా ప్రకటించారు. బుధవారం రోజున జాతీయ యాంటీ డోపింగ్ ఏజెన్సీ ఈ నోటీసు ఇచ్చింది. 2026 కామన్‌వెల్త్ గేమ్స్ స్పోర్ట్స్ ఎంట్రీస్ సిస్టమ్ నుంచి అతని పేరును తొలగించారు. అరుణ్ కుమార్ శ్యాంపిల్‌లో ఏఏఎఫ్ ఉన్నట్లు అంతర్జాతీయ జూడో ఫెడరేషన్ పేర్కొన్నది. ఈ విషయాన్ని కామన్‌వెల్త్ క్రీడా నిర్వాహకులతో పాటు భారతీయ ఒలింపిక్ సంఘానికి తెలియజేసింది. అయితే అరుణ్ కుమార్ స్థానంలో మరో జూడో ప్లేయర్‌ను రిప్లేస్ చేయలేమని భారత జూడో సమాఖ్య అధ్యక్షుడు ముకేశ్ కుమార్ తెలిపారు.

ముగిసిన సింధు పోరాటం.. మారథాన్ పోరులో చెన్ యుఫెయిదే పైచేయి



భారత స్టార్ షట్లర్ పీవీ సింధు చైనా ఓపెన్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రీక్వార్టర్స్‌లోనే వెనుదిరిగింది. గురువారం ఉత్కంఠభరితంగా సాగిన పోరులో ప్రపంచ నాలుగో ర్యాంకర్, ఆతిథ్య చైనా క్రీడాకారిణి చెన్ యుఫెయి చేతిలో 21-16, 20-22, 18-21 తేడాతో ఓటమి పాలైంది. సుమారు గంటన్నర సేపు జరిగిన ఈ పోరు.. టోర్నీలోనే అత్యుత్తమ మ్యాచ్‌లలో ఒకటిగా నిలిచింది.మొదటి గేమ్ ఆరంభంలో వెనుకబడిన సింధు అద్భుతంగా పుంజుకుంది. విరామ సమయానికి 6-11తో వెనుకబడినా.. వరుసగా 7 పాయింట్లు సాధించి 21-16తో గేమ్‌ను తన ఖాతాలో వేసుకుంది. రెండో గేమ్‌లోనూ ఆధిపత్యం కొనసాగించిన భారత క్రీడాకారిణి.. 7-3 ఆధిక్యం సాధించి విరామ సమయానికి ఆధిక్యంలో నిలిచింది. ఆ తర్వాత మరో 4 పాయింట్లు సాధించి 20-16తో విజయానికి చేరువైంది. అయితే.. కీలక సమయంలో తడబడిన సింధు.. అనవసర తప్పిదాలు చేసింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న చెన్.. వరుస పాయింట్లు సాధించి 22-20తో గేమ్‌ను కైవసం చేసుకుంది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లోనూ ఇరువురు హోరాహోరీగా తలపడ్డారు. విరామ సమయానికి 11-8తో సింధు ముందంజలో ఉన్నా.. చెన్ క్రమంగా ఒత్తిడి పెంచింది. స్థానిక ప్రేక్షకుల మద్దతుతో మరింత ఆత్మవిశ్వాసంతో చెలరేగిన చైనా స్టార్.. వరుస పాయింట్లు సాధించి 21-18తో గేమ్‌ను గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది.కాగా.. ఇటీవల జపాన్ ఓపెన్ సెమిఫైనల్లో గాయంతో మధ్యలోనే తప్పుకున్న చెన్ యుఫెయి.. ఈ గెలుపుతో నాటి ఓటమికి ప్రతీకారం తీర్చుకున్నట్లైంది. మరోవైపు.. ఈ పరాజయంతో 2019 తర్వాత వరుసగా ఇద్దరు టాప్-5 ప్లేయర్లను ఓడించే అవకాశాన్ని కొద్ది తేడాతో కోల్పోయింది సింధు.

జింబాబ్వేతో భారత్ టీ20 మ్యాచ్.. అందరి చూపూ ఆ ఇద్దరిపైనే.!



ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో వరుస పరాజయాలతో విమర్శలు ఎదుర్కొన్న భారత జట్టు ఇప్పుడు జింబాబ్వేతో జరిగే 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌పై దృష్టి సారించింది. నుంచి ప్రారంభమయ్యే ఈ సిరీస్‌లో గెలిచి ఆత్మవిశ్వాసాన్ని తిరిగిపొందాలని మెన్ ఇన్ బ్లూ భావిస్తోంది.ఇటీవల యూకే పర్యటనలో టీమ్‌ఇండియా ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. ఐర్లాండ్‌తో టీ20 సిరీస్‌ను 2-0తో, ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌ను 4-0తో కోల్పోయిన భారత్.. ఆ తర్వాత వన్డే సిరీస్‌నూ 2-1తో ఆతిథ్య జట్టుకే సమర్పించుకుంది. దీంతో జట్టు ప్రదర్శనపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. కొత్తగా సారథ్య బాధ్యతలు చేపట్టిన శ్రేయస్ అయ్యర్.. నాయకుడిగా ఇప్పటివరకు గెలుపు రుచి చూడలేదు. ఈ నేపథ్యంలో జింబాబ్వే సిరీస్ అతడికి అగ్నిపరీక్షగా మారింది. ముఖ్యంగా ఇటీవలి కాలంలో నిరాశపరిచిన భారత బ్యాటింగ్ విభాగం.. ఈ సిరీస్‌లోనైనా గాడినపడాల్సి ఉంది.ఇక ఈ మ్యాచ్‌లో.. యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీపై అందరి దృష్టి నిలిచింది. ఈ సిరీస్‌లో అతడికి మరోసారి తన ప్రతిభను నిరూపించుకునే అవకాశం లభించింది. సంజూ శాంసన్ జట్టులో లేకపోవడంతో టాప్‌ఆర్డర్‌లో వైభవ్ కీలక పాత్ర పోషించే అవకాశముంది. గతంలో అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో అద్భుత ఇన్నింగ్స్ ఆడిన హరారే మైదానంలోనే మరోసారి మెరుపులు మెరిపించాలని అతడు ఉవ్విళ్లూరుతున్నాడు. కాగితంపై బలంగానే కనిపిస్తున్న భారత జట్టు.. ఇటీవలి ఫామ్ ఆధారంగా ప్రతీ మ్యాచ్‌ను అత్యంత జాగ్రత్తగా ఆడాల్సిన పరిస్థితి ఉంది. ఈ సిరీస్‌లో విజయం సాధించి తిరిగి గెలుపుబాట పట్టాలని టీమ్‌ఇండియా ఆశిస్తోంది.హరారే పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలం. అయితే.. ప్రస్తుతం జింబాబ్వేలో శీతాకాలం కావడంతో పిచ్‌పై తేమ ఉంటుంది. అందువల్ల బౌలర్లు మరింతగా రాణించే అవకాశముంది. కాబట్టి ఈ వేదికపై భారీ స్కోర్లు ఆశించలేం. సమయం గడిచేకొద్దీ పిచ్ నెమ్మదిస్తుందని అంచనాలున్న నేపథ్యంలో టాస్ గెలిచిన జట్టు.. తొలుత బ్యాటింగ్ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇక.. మ్యాచ్ సమయంలో సగటు ఉష్ణోగ్రత 20 డిగ్రీలు నమోదుకావచ్చని అంచనా.


జూన్ లిన డబ్ల్యూటీసీ ఫైనల్.. రెండోసారి ఆ మైదానంలోనే బిగ్‌ఫైట్..!

అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఎఅఅ) మరోమారు ఇంగ్లండ్(ఇనిణశ్రీజీనిట)కే పట్టం కట్టింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఆతిథ్య హక్కులను వరసగా మూడోసారి ఆ దేశానికే కట్టబెట్టింది. డబ్ల్యూటీసీ ఫైనల్ ఓవల్ (గాలజీశ్రీ)మైదానంలో జరుగనుంది. మరో మూడు పర్యాయాలు ఇంగ్లండ్‌కే అవకాశం ఇస్తామని పేర్కొన్న ఐసీసీ చెప్పినట్టే వేదికను ఖరారు చేసింది. ఆరంభ ఎడిషన్‌లో భారత్, న్యూజిలాండ్ ఇదే మైదానంలో తలపడగా.. ఈసారి కూడా టెస్టు గద పోరు ఇక్కడే జరుగనుంది. జూన్ 9వ తేదీ నుంచి మ్యాచ్ నిర్వహించనున్నారు.ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 20225-27 ఫైనల్ తేదీ ఖరారైంది. వచ్చే ఏడాది జూన్ 9న ఇంగ్లండ్‌లోని ఓవల్ మైదానంలో టైటిల్ పోరు జరుగనుంది. తొలి సీజన్ 2021-23 ఫైనల్ ఇదే స్టేడియంలో నిర్వహించిన ఐసీసీ.. మరోమారు ఓవల్‌కు అవకాశమిచ్చింది. అయితే.. 2023-25 మాదిరిగా లార్డ్స్ స్టేడియంలోనే ఫైనల్ జరపాలని తొలుత ఐసీసీ భావించింది.కానీ, ఇటీవలే ఈ మైదానంపై ఐసీసీ అసంతృప్తి వ్యక్తం చేయడంతో వేదికను మార్చాలని ఇంగ్లండ్ వేల్స్ బోర్డు అభ్యర్థించింది. ఇంగ్లండ్, న్యూజిలాండ్ టెస్టు అనంతరం లార్డ్స్ పిచ్ ఏమంత బాగాలేదని నివేదిక రావడమే అందుకు కారణం. దాంతో.. మరోసారి ఓవల్‌కు డబ్ల్యూటీసీ ఫైనల్ నిర్వహించే అవకాశం లభించింది. జూన్ 9 నుంచి 13 వరకూ ఫైనల్ మ్యాచ్ జరుగనుంది.ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉంది. గత ఎడిషన్ విజేత దక్షిణాఫ్రికా, తొలి సీజన్ ఛాంపియన్ న్యూజిలాండ్ వరసగా రెండు, మూడు స్థానాల్లో కొనసాగుతున్నాయి. చూస్తుంటే.. ఈసారి ఫైనల్లో ఆసీస్, సఫారీలు లేదా.. ఆసీస్, కివీస్ తలపడే అవకాశముంది.ఎందుకంటే ఈ మూడు జట్లు మాత్రమే ఈ సైకిల్‌లో మరో 10 మ్యాచులు ఆడనున్నాయి. ఇప్పటికైతే బంగ్లాదేశ్ నాలుగులో, వరసగా రెండు ఫైనల్స్ ఆడిన భారత జట్టు ఐదో ప్లేస్‌లో నిలిచాయి. శ్రీలంక, ఇంగ్లండ్, వెస్టిండీస్, పాకిస్థాన్ జట్లు ఆ తర్వాతి స్థానాల్లో నిలిచి.. ఫైనల్ బెర్తుకు ఆమడ దూరంలో ఉండిపోయాయి.



స్వరాజ్యం నా జన్మ సిద్ధ హక్కు -సాధించుకొని తీరుతాను అని చెప్పిన బాలగంగాధర్ తిలక్ గారి 170వ జయంతి

మోదీపూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు బాబు



నాగర్ కర్నూల్ (తెలంగాణ పవర్) జులై : 23 : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ నాగర్ కర్నూల్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో నేడు బాలగంగాధర్ తిలక్ 170 జయంతి సందర్భంగా ఏబీవీపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

అనంతరం ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంగన మోని బంగారు బాబు మాట్లాడుతూ....స్వరాజ్యం నా జన్మహక్కు -- దానిని సాధించుకొని తీరుతాను అనే మహోన్నత నినాదంతో భారత స్వాతంత్ర్యోద్యమానికి నూతన ఊపునిచ్చిన మహనీయుడు, లోకమాన్య బాల గంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పిస్తున్నాము.దేశభక్తి, స్వదేశీ భావన, జాతీయ విద్య, ప్రజల్లో చైతన్యం కలిగించడంలో తిలక్ గారి సేవలు చిరస్మరణీయమైనవి. భారతీయులలో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించి, యువతకు దేశసేవే పరమావధి అని బోధించిన గొప్ప జాతీయవాది ఆయన.నేటి యువత బాల గంగాధర్ తిలక్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధి, జాతీయ సమైక్యత, సామాజిక బాధ్యతల పట్ల అంకితభావంతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా పిలుపునిస్తున్నాము.

ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రసాద్, నగర సంయుక్త కార్యదర్శి శివ, భరత్, మార్కండేయ మహిళా కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

రాజలక్ష్మి కాలనీలో నూతన కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం

ఎమ్మెల్యే దేవీరెడ్డి సుధీర్ రెడ్డి



తెలంగాణ పవర్ న్యూస్ నాగోల్ డివిజన్ ఎల్బీనగర్ జులై: నాగోల్ పరిధిలో రాజలక్ష్మి కాలనీలోని నూతనంగా నిర్మించిన "రాజలక్ష్మి కాలనీ కమ్యూనిటీ హాల్ ను .

శ్రీమతి కొలన్ రాజ్యలక్ష్మమ్మ (పెద్దగౌడ్) గారి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు కొలన్ నర్సింహా గౌడ్, కొలన్ ప్రభాకర్ గౌడ్, కొలన్ చంద్రశేఖర్ ఆజాద్, కొలన్ భరత్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించి కాలనీవాసులకు అంకితం చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ నియోజకవర్గ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారు విచ్చేసి వారి చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి కమ్యూనిటీ హాల్‌ను ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి గారు మాట్లాడుతూ కాలనీ ప్రజలకు సామాజిక,సాంస్కృతిక,శుభకార్యాల నిర్వహణకు ఈ కమ్యూనిటీ హాల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. సమాజానికి ఉపయోగపడే శాశ్వత ఆస్తిని నిర్మించి ప్రజలకు అందించిన దాతలను అభినందించారు.అనంతరం యువ నాయకులు చంద్రశేఖర్ అజాద్ గారి పుట్టినరోజు సందర్భంగా కేకు కట్ చేసి పుట్టినరోజు వేడుకలను నిర్వహించి శుభాకాంక్షలు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం ఉపాధ్యక్షులు బద్దం ధనుంజయ్ గౌడ్ గారు,మాజీ నాగోల్ స్కూల్ కమిటీ అధ్యక్షులు బద్దం వెంకటేష్ గౌడ్ గారు,సీనియర్ బీఆర్ఎస్ నాయకులు అనంతుల రాజరెడ్డి గారు,తూర్పటి చిరంజీవి,రంగేశ్వరి నాయుడు,సతీష్ యాదవ్,శిల్పరెడ్డి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు,స్థానిక ప్రముఖులు,కాలనీవాసులు నాయకులు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ రంగంలో విశిష్ట సేవలకు డా. అర్జున్ కొమ్మలపాటి, సంధ్యారాణి కొమ్మలపాటికి అరుదైన గౌరవాలు



రియల్ ఎస్టేట్ రంగంలో రెండు దశాబ్దాలుగా విశిష్ట సేవలందిస్తూ వినియోగదారుల విశ్వాసాన్ని సంపాదించిన ఆర్జా ఇన్‌ఫ్రా డెవలపర్స్ మరియు ఓపెన్ ప్లాట్స్ అండ్ విల్లాస్ డాట్ కామ్ సంస్థల వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వాహణ అధికారి డా. అర్జున్ కొమ్మలపాటి పలు ప్రతిష్టాత్మక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను అందుకుని తన ప్రతిభను చాటుకున్నారు.


సమాచార సాంకేతిక రంగంతో పాటు రియల్ ఎస్టేట్ రంగంలో సుమారు 20 ఏళ్ల అనుభవంతో ముందుకు సాగుతున్న డా. అర్జున్ కొమ్మలపాటి సేవలకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్, ఏపీజే అబ్దుల్ కలాం గ్లోబల్ ఐకాన్ అవార్డు, స్వర్ణ నంది పురస్కారం, విజనరీ ఎంట్రప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్--2026 అవార్డులు లభించాయి. వ్యాపార విజయాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ఆయన చురుకుగా పాల్గొంటూ సమాజానికి తన వంతు సేవలు అందిస్తున్నారు.

అదే సంస్థ డైరెక్టర్ సంధ్యారాణి కొమ్మలపాటి కూడా రియల్ ఎస్టేట్ రంగంలో సమర్థవంతమైన నాయకత్వం ప్రదర్శిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆమెకు జాతీయ బంగారు నంది అవార్డు--2026 ప్రదానం చేయడం విశేషం. సామాజిక సేవ పట్ల ఆసక్తి కలిగిన ఆమె వివిధ సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యమవుతూ సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, వ్యాపారవేత్తలు, స్నేహితులు, శ్రేయోభిలాషులు డా. అర్జున్ కొమ్మలపాటి, సంధ్యారాణి కొమ్మలపాటిని అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఎల్ నినో' సవాళ్లపై తెలంగాణ సర్కార్ పక్కా ప్రణాళిక

-వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై ప్రభావం పడకుండా ముందస్తు చర్యలు
వేల కిలోమీటర్ల దూరపు వాతావరణ మార్పులపై గ్రామీణ స్థాయి వరకు అవగాహన
రైతాంగానికి మేలు చేసేలా ప్రత్యామ్నాయ పంటలు.. స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్
పగటి పూట సోలార్ విద్యుత్ వినియోగంతో ఆర్థిక భారం తగ్గుతుంది: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క





హైదరాబాద్ : ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో చోటుచేసుకుంటున్న 'ఎల్ నినో' వంటి మార్పులు రాష్ట్ర ప్రజలపై, ముఖ్యంగా వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై ప్రభావం చూపకుండా ఉండేందుకు తెలంగాణ ప్రభుత్వం దూరదృష్టితో పక్కా ప్రణాళికలు రూపొందిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్లానింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతల పెరుగుదల నుంచి తెలంగాణ సంసిద్ధత వరకు" అనే అంశంపై రాష్ట్ర స్థాయి అవగాహన సదస్సుకు ఆయన రాష్ట్ర మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ,

''కేవలం పాలనావరమైన నిర్ణయాలు తీసుకోవడమే కాకుండా, ఎల్ నినో ప్రభావంపై ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. సమస్య తీవ్రతను ముందే గ్రహిస్తే ప్రతి కుటుంబం, ప్రతి గ్రామం సొంతంగా సరైన ప్రణాళికలు వేసుకోగలుగుతుంది.'' అని అన్నారు.వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న భూమధ్యరేఖా పసిఫిక్ మహాసముద్రంలో జరిగే ఉష్ణోగ్రతల మార్పులు తెలంగాణలోని చెరువులు, వాగులు, గ్రామాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయో శాస్త్రవేత్తల ద్వారా విశ్లేషింపజేసి, సమర్థవంతమైన కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. తాగునీరు, సాగునీటితో పాటు పశువులు, పక్షులు మరియు అడవి జంతువుల నీటి, ఆహార అవసరాలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. వ్యక్తిగత, కుటుంబ, గ్రామ, మండల మరియు జిల్లా స్థాయిల్లో ఎవరికి వారు సంసిద్ధమయ్యేలా ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితులు ఎదురైనా రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు నిపుణుల సూచనల మేరకు తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల విధానాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఈ సమాచారాన్ని ప్రత్యక్ష ప్రసారాల (ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ తీసుకెళ్లడంలో టీవీ ఛానెళ్లు తమ సామాజిక బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నాయని అభినందించారు.మన జీవన విధానంలో విద్యుత్ అత్యంత ప్రధానమైనదని, ఎల్ నినో వల్ల పెరిగిన డిమాండ్‌ను తట్టుకునేందుకు ప్రభుత్వం అత్యంత సమర్థవంతమైన 'ఎనర్జీ మేనేజ్‌మెంట్' అమలు చేస్తోందని వివరించారు. పగటి పూట విరివిగా, తక్కువ ధరకు లభించే సౌర విద్యుత్‌ను (సోలార్ పవర్) గరిష్టంగా వినియోగించుకోవడం ద్వారా ప్రజలపై, ప్రభుత్వంపై పడే ఆర్థికభారంతగ్గుతుందన్నారు. సోలార్ సమయాన్ని సమర్థవంతంగా వాడుకుంటూ, తదుపరి అవసరాలకు థర్మల్ విద్యుత్‌ను క్రమబద్ధంగా వినియోగించడం ద్వారా గ్రిడ్ స్థిరత్వాన్ని కాపాడుతున్నామని స్పష్టం చేశారు.వర్షాకాలంలోనూ 'వేసవి' స్థాయి డిమాండ్ఉష్ణోగ్రతలు పెరగడంతో పగలు, రాత్రి అనే తేడా లేక ఫ్యాన్లు, ఏసీలు, లైట్లు, బోర్‌వెల్స్ మరియు లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్ల వాడకం భారీగా పెరిగిందన్నారు. సాధారణంగా వర్షాకాలంలో విద్యుత్ డిమాండ్ తక్కువగా ఉంటుంది, కానీ ఎల్ నినో ప్రభావంతో తెలంగాణలో ప్రస్తుత డిమాండ్ ఏప్రిల్ (వేసవి) నాటి గరిష్ట (పీక్) స్థాయికి చేరుకుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న సీజన్లకు అనుగుణంగా విద్యుత్ వినియోగంలో మార్పులు వస్తున్నాయని, పెరిగిన అవసరాలకు తగ్గట్టుగా ఎనర్జీ ప్లానింగ్ రూపొందించుకోవడంలో తెలంగాణ ముందుంటుందని తెలిపారు. ఏసీలు, ఫ్యాన్లు, మోటార్ల వాడకంలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.

సమాజంలో చైతన్యం తీసుకురావడానికి విషయ నిపుణులను ఆహ్వానించి ఈ సదస్సును ఏర్పాటు చేసిన ప్లానింగ్ శాఖను ఉప ముఖ్యమంత్రి అభినందించారు. వ్యవసాయ, విద్యుత్, సాగునీటి భూగర్భ జల శాఖలతో పాటు అనుబంధ శాఖలన్నింటినీ సమన్వయం చేసుకుని సదస్సును నిర్వహించడం ప్రణాళికా శాఖ ప్రతిభకు, సామాజిక బాధ్యతకు నిదర్శనమని కొనియాడారు. ఇటువంటి అవగాహన సదస్సులను భవిష్యత్తులో జిల్లాల వారీగా కూడా నిర్వహించి ప్రజలను భాగస్వాములను చేస్తూ పూర్తి స్థాయి చైతన్యం తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పాలనాధికారులు తమ విధులతో పాటు సమాజానికి మేలు చేసే ఇటువంటి అంశాలలో ప్రజలనుచైతన్యవంతంచేయడంఅభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ప్లానింగ్ సెక్రెటరీ గౌరవ ఉప్పల్, ఐఏఎస్ అధికారులు దివ్య దేవరాజన్, గోపి, జితేష్ వి పాటిల్ ప్లానింగ్ డైరెక్టర్ రూఫోస్ దత్తం తదితరులు పాల్గొన్నారు.

తమిళ సాహిత్య, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా 'నం ఉరథ చింతనై' 18వ వార్షికోత్సవం



హైదరాబాద్, జూలై 19: హైదరాబాద్‌లోని రవీంద్రభారతి మినీ హాల్‌లో 'నం ఉరథ చింతనై' హైదరాబాద్ శాఖ 18వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. తమిళ భాష, సాహిత్యం, సంస్కృతి పరిరక్షణకు అంకితభావంతో నిర్వహించిన ఈ వేడుకలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఈ సందర్భంగా ప్రముఖ తమిళ కవులు, రచయితలు సాహిత్య విలువలు, భాషా వికాసంపై ప్రసంగించారు. కవితా పఠనాలు సాహిత్యాభిమానులను అలరించగా, చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నాయి. అలాగే 'ఉ రథ చింతనై' ప్రత్యేక సంచికను ఘనంగా ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమానికి 'ఉరథ చింతనై' కార్యదర్శి శ్రీ ఉదయం రామ్, అధ్యక్షురాలు శ్రీమతి పద్మిని పట్టాభిరామన్, హైదరాబాద్ శాఖ అధ్యక్షురాలు శ్రీమతి రామతిలకం, కార్యదర్శి (శాస్త్రవేత్త) శ్రీ రాజు హాజరయ్యారు.

ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ప్రముఖ విజిల్ గాయకుడు డాక్టర్ శివప్రసాద్ తన విశిష్ట విజిల్ సంగీత కచేరీతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఆయన ప్రదర్శనకు సభికుల నుంచి ఘనమైన ప్రశంసలు లభించాయి.

ఈ వేడుకల్లో హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తమిళ సాహిత్యాభిమానులు, కళాప్రేమికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తమిళ భాషా వైభవాన్ని, సాంస్కృతిక సంప్రదాయాలను భావితరాలకు చేరవేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.

ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

డి ఇ ఓ వాసంతి



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి జూలై 23 తెలంగాణ పవర్ : మణుగూరు మండలం జడ్పీఎస్ఎస్ కో-ఎడ్యుకేషన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన మూడు రోజుల ఉపాధ్యాయ వృత్యాంతర శిక్షణా కేంద్రాన్ని గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి డి వాసంతి సందర్శించారు అలాగే ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను ఆమె నిశితంగా పరిశీలించారు.

?అనంతరం ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ..(పునాది అక్షరాస్యత మరియు సంఖ్యాజ్ఞానం) కార్యక్రమంలో భాగంగా బోధనా నైపుణ్యాలను మరింతగా ఎలా మెరుగుపరచుకోవాలి అనే దానిపై పలు సూచనలు చేశారు. ఆధునిక బోధనా పద్ధతులను ఉపయోగించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, ప్రతి విద్యార్థికి కనీస సామర్థ్యాలను సాధించే విధముగా, సంఖ్యాజ్ఞానం వచ్చేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఏఎంఓ మండల రిసోర్స్ పర్సన్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు వేగవంతం

- వక్ఫ్ భూ వివాదాల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు - జిల్లా వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహణ

రాజన్న సిరిసిల్ల, జూలై 23: రాజన్న సిరిసిల్ల జిల్లాలో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, భూ వివాదాల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. నగేష్ అధికారులను ఆదేశించారు. జిల్లా వక్ఫ్ ప్రొటెక్షన్ అండ్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం గురువారం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో ఆయన అధ్యక్షతన నిర్వహించారు.

సమావేశంలో జిల్లా వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ జిల్లాలోని వక్ఫ్ ఆస్తులు, భూములు, వాటికి సంబంధించిన సమస్యలను వివరించారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, భూ వివాదాలు తలెత్తినప్పుడు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని అదనపు కలెక్టర్ సూచించారు.

వక్ఫ్ కమిటీకి చెందిన ఎన్జీవో సభ్యుడు, మహిళా సభ్యురాలు, న్యాయవాది సభ్యుడు జిల్లాలోని పలు వక్ఫ్ వివాదాలను సమావేశం దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ సమావేశంలో డీఎస్పీ, డీఆర్ఓ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు, ఇరు మున్సిపల్ కమిషనర్లు, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి జి. కుమారస్వామి, అసిస్టెంట్ డైరెక్టర్ (సర్వే అండ్ ల్యాండ్), సబ్-రిజిస్ట్రార్, వక్ఫ్ కమిటీ సభ్యులు, జిల్లా వక్ఫ్ ఇన్‌స్పెక్టర్, మైనారిటీ సంక్షేమ శాఖ సిబ్బంది తదితర అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచి చూసిన సర్పంచ్ షేక్ యాస్మిన్ ఫిరోజ్ పాషా

- హైస్కూల్‌లో భోజన నాణ్యత, వాష్‌రూమ్‌ల పరిశుభ్రతపై తనిఖీ



వేములవాడ, జులై 23: గ్రామ ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిశుభ్రతను గ్రామ సర్పంచ్ షేక్ యాస్మిన్ ఫిరోజ్ పాషా పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా అనే విషయాన్ని తనిఖీ చేసి, వంటశాల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు వినియోగిస్తున్న వాష్‌రూమ్‌లు, తాగునీటి సౌకర్యం, నిర్వహణను పరిశీలించి ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

తర్వాత విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన సర్పంచ్, భోజనం నాణ్యతపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించడం, పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం కల్పించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ముష్కం గంగాధర్, నక్క ఎల్లయ్య, ఊరడి రమేష్ యాదవ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సినిమా

35 చిన్న కథ కాదు" సినిమా టీమ్ ను అభినందించిన "సమ్మర్ హాలిడేస్" మూవీ టీమ్



ఇటీవల ప్రకటించిన 72వ నేషనల్ ఫిలిం అవార్డ్స్ లో ఉత్తమ బాలల చిత్రం, ఉత్తమ బాల నటుడు విభాగాల్లో రెండు అవార్డ్స్ గెల్చుకుంది "35 చిన్న కథ కాదు" సినిమా. ఈ చిత్రంలోని నటనకు ఉత్తమ బాల నటుడిగా జాతీయ అవార్డ్ అందుకున్నారు మాస్టర్ అరుణ్ దేవ్ పోతుల. మాస్టర్ అరుణ్ దేవ్ ప్రస్తుతం "సమ్మర్ హాలిడేస్" అనే బాలల చిత్రంలో నటిస్తున్నారు. ఈ నేపథ్యంలో "35 చిన్న కథ కాదు" మూవీ టీమ్ ను అభినందించారు "సమ్మర్ హాలిడేస్" సినిమా టీమ్. "సమ్మర్ హాలిడేస్" చిత్రాన్ని ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై ధీరజ్ మొగిలినేని నిర్మిస్తున్నారు. దర్శకుడు శ్రీకర్ రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. త్వరలోనే "సమ్మర్ హాలిడేస్" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు జరిగిన ఈవెంట్ లో మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ యెర్రమల్లి మాట్లాడుతూ – 35 చిన్న కథ కాదు బ్యూటిఫుల్ ఫిలిం. ఈ సినిమాలో అరుణ్ నటన చూస్తున్నప్పుడు భావోద్వేగానికి గురయ్యాను. డైరెక్టర్ నందకిషోర్ ఎఫర్ట్స్ వల్లే ఈ రోజు నేషనల్ అవార్డ్స్ వచ్చాయి. ఈ చిత్రానికి వివేక్ సాగర్ ఇచ్చిన సంగీతం నన్ను ఇన్స్ పైర్ చేస్తుంటుంది. అరుణ్ ఇప్పుడు మా సమ్మర్ హాలిడేస్ సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమాలో అతని నటన చూస్తున్నప్పుడు కూడా ఎమోషనల్ అవుతుంటా. 35 చిన్న కథ కాదు టీమ్ కు నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. అన్నారు.

డైరెక్టర్ శ్రీకర్ మాట్లాడుతూ – తెలుగు సినిమా గర్వపడే బాలల చిత్రాన్ని అందించిన 35 చిన్న కథ కాదు టీమ్ కు నా శుభాకాంక్షలు చెబుతున్నా. ఎప్పుడో 30 ఏళ్ల కిందట బాల రామాయణం సినిమాకు తెలుగు సినిమాకు ఉత్తమ బాలల చిత్రం అవార్డ్ వచ్చింది. ఇప్పుడు మళ్లీ 35 చిన్న కథ కాదు సినిమాతో ఆ గౌరవం దక్కింది. అరుణ్ మంచి నటుడు. మా సమ్మర్ హాలీడేస్ సినిమాలో నటిస్తున్నాడు. షూటింగ్ టైమ్ లో 35 చిన్న కథ కాదు సినిమా కోసం వాళ్ల టీమ్ ఎంత కష్టపడ్డారో చెప్పేవాడు. మా సినిమాలోని ఒక సీన్ కు రెండు పేజీల డైలాగ్ సింగిల్ టేక్ లో చెప్పాడు. మా మూవీలో అరుణ్ పర్ ఫార్మెన్స్ చూస్తుంటే అతను నవ్వితే నేను నవ్వాను, ఏడిస్తే ఏడ్చాను. నటుడిగా ఎదగడంలో అరుణ్ ను ఎంతో సపోర్ట్ గా నిలుస్తున్న వారి పేరెంట్స్ కు అభినందనలు. అన్నారు.

ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ – నేను థియేటర్ లో 35 చిన్న కథ కాదు సినిమాను మిస్ అయ్యాను. ఓటీటీలో చూశాను. కథను నమ్మి ప్రియదర్శి, నివేదా, దర్శక నిర్మాతలు ఈ సినిమాను చేశారు. వాళ్లు ఈ సినిమా కోసం పెట్టిన ఎఫర్ట్ కు హ్యాట్సాఫ్. ఓటీటీలో సినిమా చూసినప్పుడు థియేటర్ లో ఈ సినిమా మరింతగా ఆదరణ పొందాల్సింది అనిపించింది. మరింతగా ప్రేక్షకులు రీచ్ కావాల్సిన చిత్రమిది. నేను సమ్మర్ హాలీడేస్ సినిమా ప్రొడ్యూస్ చేసేందుకు స్ఫూర్తినిచ్చింది 35 చిన్న కథ కాదు. నేషనల్ అవార్డ్స్ రాకున్నా ఇంతమంచి సినిమా చేసినందుకు డైరెక్టర్ నందకిషోర్ ను సత్కరించాలని అనుకున్నా. ఆయన ఇలాంటి మంచి చిత్రాలు మరిన్ని చేయాలి. సోలో హీరోగా మూవీస్ చేస్తున్న ప్రియదర్శి ఈ చిత్రంలో కీ రోల్ చేయడం మూవీకి బాగా కలిసొచ్చింది. నివేదా థామస్ లాగే ప్రియదర్శి ఉండటం వల్ల ప్రేక్షకులకు ఈ సినిమా గురించి తెలిసింది. ఈ చిత్రంలో విశ్వదేవ్ నటన ఆకట్టుకుంది. వివేక్ సాగర్ మ్యూజిక్ చేసిన ఈ చిత్ర పాటలు ఇప్పటికీ తరుచూ వింటుంటాను. నా స్నేహితుడు సృజన్ కు సినిమా పట్ల ఉన్న ప్యాషన్ ఏంటి అనేది ఈ సినిమాతో నాకు అర్థమైంది. ఆయన మీద గౌరవం పెరిగింది. అరుణ్ మా సినిమా కోసం ఆడిషన్ చేస్తున్నప్పుడు ఈ పాత్రకు పర్ఫెక్ట్ అనిపించాడు. అరుణ్ ను చూస్తే మా ఇంట్లో అబ్బాయిలా అనిపిస్తాడు.

యాక్టర్ విశ్వదేవ్ మాట్లాడుతూ – నందకిషోర్ ఈ కథ చెప్పినప్పుడు మేము ఎంత ఎగ్జైట్ అయ్యామో థియేటర్స్ లో ప్రేక్షకులు కూడా అలాగే ఫీలయ్యారు. ఈ సినిమాకు ఒక డ్రీమ్ టీమ్ కుదిరింది. వాళ్లంతా సినిమాను నమ్మి పనిచేయడం వల్లే ఈరోజు రెండు నేషనల్ అవార్డ్స్ వచ్చాయి. గతంలోనూ మా సినిమా ఏ ఫిలింఫెస్టివల్ కు వెళ్లినా అక్కడ అవార్డ్స్ సాధిస్తూనే ఉంది. ప్రియదర్శి మా సినిమాకు ఎంత సపోర్ట్ గా నిలిచారో మా టీమ్ అందరికీ తెలుసు. అరుణ్ ఎంతో సహజంగా పర్ ఫార్మ్ చేస్తాడు. మా సినిమాకు వివేక్ సాగర్ అందించిన మ్యూజిక్ కాంట్రిబ్యూషన్ గురించి ఎంత చెప్పినా తక్కువే. రీసెంట్ గా నేను సమ్మర్ హాలీడేస్ మూవీ నుంచి క్రష్ సాంగ్ విన్నాను. మళ్లీ మా 35 చిన్న కథ కాదు మ్యూజిక్ వైబ్ రీకాల్ చేసుకున్నాను. 35 చిన్న కథ కాదు సినిమా టీమ్ మరిన్ని మంచి మూవీస్ చేయాలని కోరుకుంటున్నా. అన్నారు.

హీరో ప్రియదర్శి మాట్లాడుతూ – మా టీమ్ ను అభినందిస్తూ ఈవెంట్ చేస్తున్న ధీరజ్ గారికి థ్యాంక్స్. 8 ఏళ్ల కిందట నేను ఈ కథ విన్నా. 2024లో మా మూవీ వచ్చింది. ఈ సినిమా సెట్స్ లో ఉండగా డైరెక్టర్ నందకిషోర్ రోజూ ఆధునిక మహాభారతం పుస్తకం తెచ్చేవాడు. ఆ పుస్తకం చదువుతూ ఆధునిక రామాయణం తెరకెక్కించాడు. ఇలాంటి గొప్ప సినిమా నా లైఫ్ లో మళ్లీ చేయలేనేమో. అలాంటి అవకాశం వస్తుందో రాదో కూడా తెలియదు. మా అమ్మా నాన్న చేసుకున్న పుణ్యం వల్లే నాకు ఈ కథ వచ్చిందని భావిస్తా. డైరెక్టర్ నందకిషోర్ ఒక యుద్ధం చేస్తే గానీ ఈ కథ బయటకు రాలేదు. మంచి సినిమా వచ్చినప్పుడు మన ప్రేక్షకులు ఎంత ప్రేమిస్తారు అనేది ఈ సినిమాతో మేము చూశాం. ఇలాంటి మరిన్ని మంచి చిత్రాలు చేయాలనే స్ఫూర్తిని నింపారు. ఈ కథ విన్నప్పుడు మా అమ్మ గుర్తొచ్చింది. అందుకే ఈ సినిమా చేశా. మీకూ మా పేరెంట్స్ గుర్తుకువస్తారు. నేషనల్ అవార్డ్ అందుకున్న అరుణ్ కు కంగ్రాట్స్. వాళ్ల ఇంట్లో గిన్నెల కంటే అవార్డ్స్ ఎక్కువ ఉండే రోజులు రాబోతున్నాయి.

మాస్టర్ అరుణ్ దేవ్ మాట్లాడుతూ – 35 చిన్న కథ కాదు ఇది చాలా పెద్ద కథ. ఓటమి అనే మైనస్ నుంచి గెలుపు అనే ప్లస్ వైపు అడుగులు వేస్తుంటే అందరికీ ఎదురయ్యే మజిలీ సున్నా. ఆ సున్నాను దాటుకున్నాం నేషనల్ అవార్డ్స్ కు చేరుకున్నాం. ఓడిపోతున్నప్పుడు ధైర్యం చెప్పేందుకు తలా ఒక చేయి అందిస్తారు. అలా మా టీమ్ అందరి చేతులు నా మీద పడి నాకు బలాన్నిచ్చాయి, జాతీయ పురస్కార గౌరవాన్ని అందించాయి. ఈవెంట్ చేసి మమ్మల్ని సత్కరిస్తున్న ధీరజ్ గారికి థ్యాంక్స్. ఆయన నిర్మిస్తున్న సమ్మర్ హాలీడేస్ లో నాకు అవకాశం కల్పించారు. మా పేరెంట్స్, ఫ్యామిలీ, టీచర్స్ సపోర్ట్ వల్లే ఈ స్థాయికి రాగలిగాను. ఈ జాతీయ అవార్డ్ ను మా అమ్మకు అంకితమిస్తున్నా. అన్నారు.

డైరెక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ – తెలుగు సినిమాకు ఉత్తమ బాలల చిత్రంగా అప్పట్లో బాల రామాయణం సినిమాకు నేషనల్ అవార్డ్ వచ్చింది. మళ్లీ ఇన్నేళ్లకు మా సినిమాకు ఆ గౌరవం దక్కింది. ఈ చిత్ర దర్శకుడిగా గర్వపడుతున్నాను. మా సినిమా టీమ్ ను సత్కరించాలని ఈవెంట్ నిర్వహిస్తున్న ధీరజ్ గారికి థ్యాంక్స్. వారు సమ్మర్ హాలీడేస్ అనే సినిమా చేస్తున్నారు. శ్రీకర్ దర్శకత్వం వహిస్తున్న సమ్మర్ హాలీడేస్ సినిమాకు 2028లో నేషనల్ అవార్డ్ వస్తుంది. ఆ సన్మాన కార్యక్రమంలో నేను అతిథిగా పాల్గొంటా. ఎంతోమంది ఎన్నో సందేహాలు వెలిబుచ్చిన కథ ఇది. అలాంటి టైమ్ లో మనం కథ విన్నప్పుడు కలిగిన అనుభూతిని ప్రేక్షకులకు పంచాలని ముందుకొచ్చారు, నాకు సపోర్ట్ గా నిలపడ్డారు మా ప్రొడ్యూసర్స్ సృజన్, సిద్ధార్థ్. వాళ్లు ఈ సినిమా కోస నిలబడకపోతే అరుణ్ వయసు పెరిగేది. దర్శకుడిగా అవకాశాల కోసం తిరుగుతూ నా గెడ్డం మరింత నెరిసేది. మా ప్రొడ్యూసర్స్ నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నానని నమ్ముతున్నా. మనల్ని నమ్మి డబ్బులు పెట్టే ప్రొడ్యూసర్ ను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉంది. లేకపోతే ఇకపై వాళ్ల బ్యానర్ లో రావాల్సిన కొత్త సినిమాలు ఆగిపోతాయి. అలాంటి బాధ్యతతోనే నేను సినిమా రూపొందించాను. మా సినిమాకు ఇలాంటి గౌరవాలు, ప్రేక్షకుల అభిమానం దక్కుకుంటే ఇలాంటి మరో సినిమా నిర్మించేందుకు ఎవరూ ముందుకు రారు. మా సినిమానే ఉదాహరణగా చూపిస్తారు. మా సినిమాకు నేషనల్ అవార్డ్స్ ప్రకటించిన జ్యూరీకి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు. అన్నారు.

తమ అబ్బాయి కోరుకున్న రంగంలో రాణించేలా తాము ప్రోత్సహించడం వల్లే ఈ రోజు ఉత్తమ బాల నటుడిగా జాతీయ అవార్డ్ దక్కిందని, అరుణ్ పేరెంట్స్ అని మమ్మల్ని పిలిచేలా గౌరవాన్ని తీసుకొచ్చాడని ఈ సందర్భంగా అరుణ్ దేవ్ పేరెంట్స్ సురేష్, సత్యవాణి సంతోషాన్ని వ్యక్తం చేశారు.

విడాకుల తర్వాత నిహారికకి కలిసొచ్చిందా.. తండ్రికి తగ్గ తనయ!



ఈ మధ్యకాలంలో కొంతమంది సెలబ్రిటీల విషయంలో చోటు చేసుకుంటున్న అనూహ్య పరిణామాలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ఇకపోతే ఈ మధ్యకాలంలో నాగచైతన్య, అఖిల్ అక్కినేని, సమంత లాంటి సెలబ్రిటీలు వివాహం తర్వాత మంచి సక్సెస్ ను అందుకొని దూసుకుపోతుంటే.. మరికొంతమంది తమ భాగస్వాములకు విడాకులు ఇచ్చిన తర్వాత మరింత జోరు పెంచారు. అలాంటి వారిలో నిహారిక కూడా ఒకరు. పెద్దలు కుదిర్చిన వివాహాన్ని చేసుకున్నా.. ఆ పెళ్లి మూన్నాళ్ల ముచ్చటగానే మిగలగా.. ఆ తర్వాత ఎన్నో ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొన్న మెగా డాటర్ ఇప్పుడు రెట్టింపు వేగంతో దూసుకొచ్చి ఏకంగా నేషనల్ అవార్డును అందుకొని అందరిని ఆశ్చర్యపరిచింది. టీవల జూలై 18వ తేదీన న్యూఢిల్లీ కేంద్రంగా కేంద్ర ప్రభుత్వం 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల జాబితాను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నిహారిక నిర్మించిన కమిటీ కుర్రోళ్లు చిత్రానికి ఏకంగా రెండు నేషనల్ అవార్డులు లభించాయి .ఒకటి ఉత్తమ ప్రాంతీయ చిత్రం కాగా.. మరొకటి బెస్ట్ మేకప్ విభాగంలో నేషనల్ అవార్డులు లభించడంతో పలువురు సెలబ్రిటీలు, అభిమానులు, నెటిజన్స్ నిహారికపై అలాగే కమిటీ కుర్రోళ్లు చిత్ర బృందం పై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఓనీలతివబ ఇకపోతే ఇదే సమయంలో నాగబాబుకు సంబంధించిన ఒక విషయం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. 38 ఏళ్ల తర్వాత తండ్రి రికార్డును నిహారిక రీ క్రియేట్ చేసింది అంటూ కామెంట్లు చేస్తున్నారు. అసలు విషయంలోకి వెళ్తే.. 1988లో మెగాస్టార్ చిరంజీవి హీరోగా కే బాలచందర్ దర్శకత్వం వహించిన రుద్రవీణ చిత్రాన్ని.. నిర్మాతగా నాగబాబు నిర్మించారు. అయితే ఈ సినిమా కమర్షియల్ గా ప్రేక్షకులను మెప్పించలేదు. కానీ ఏకంగా నేషనల్ అవార్డులను అందుకొని అందరి దృష్టిని ఆకట్టుకుంది. ముఖ్యంగా ఈ చిత్రం మూడు విభాగాలలో నేషనల్ అవార్డును అందుకుంది.

"జన నాయకుడు" విజయ్ అభిమానులకు ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా: నిర్మాత వెంకట్ కె. నారాయణ (కేవీఎన్)



తమిళనాడు ముఖ్యమంత్రి, అగ్ర కథానాయకుడు విజయ్ 'జన నాయకుడు' సినిమా కోసం సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. హెచ్.వినోద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పూజా హెగ్డే, బాబీ డియోల్, మమితా బైజు కీలక పాత్రలు పోషించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై వెంకట్ కె. నారాయణ ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. భారీ అంచనాలు వున్న ఈ చిత్రం జులై 23న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాత వెంకట్ కె. నారాయణ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

ఈ సినిమా రిలీజ్ విషయంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారు కదా? మీరు ముందుగానే ఊహించారా?

ముందుగానే కొన్ని ఇబ్బందులు రావొచ్చని మేము అనుకున్నాం. విజయ్ గారు కూడా, "ఇది నా చివరి సినిమా. దీని తర్వాత పూర్తిగా రాజకీయాల్లోకి వెళ్తున్నాను. అందువల్ల కొన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంది" అని ముందే చెప్పారు. అయితే రిలీజ్ సమయంలో థియేటర్స్ విషయంలో కొన్ని అడ్డంకులు రావచ్చని మాత్రమే భావించాం. కానీ మేము ఊహించని కొన్ని పరిస్థితులు వచ్చాయి. జీవితం ఎప్పుడూ ఊహించని మలుపులు తీసుకుంటుంది. జనవరిలో విడుదల కావాల్సిన సినిమా ఇప్పుడు జులై 23కి వచ్చింది. మొత్తంగా చూస్తే రిలీజ్, పైరసీ, కోర్టు వ్యవహారాలు... ఇలా ఇన్ని సమస్యలు ఎదురవుతాయని మేము అసలు ఊహించలేదు. కాకపొతే ఇందులో మంచిని కూడా చూడాలంటే విజయ్ గారు ముఖ్యమంత్రి అయిన తర్వాత సినిమా వస్తోంది. అది అభిమానులకు మరింత ఉత్సాహం ఇస్తుంది.

మీరు బిజినెస్‌లో ఎంతో ఉన్నత స్థాయికి వెళ్లారు.సినిమాల్లోకి రావాలనే ఆలోచన ఎలా వచ్చింది?

నాకు చిన్నప్పటి నుంచే సినిమాలంటే చాలా ఇష్టం. అకాడమిక్ పుస్తకాల్లో దొరకని ఎన్నో గొప్ప విషయాలు సినిమాల్లో ఉంటాయి. పాటలు, లిరిక్స్, కథలు... ఇవన్నీ మన జీవితంపై ఎంతో ప్రభావం చూపుతాయి. ఇటీవల విడుదలైన పెద్ది సినిమాలో "ఒకేలాగే బతికేయడానికి ఇంత పెద్ద జన్మ ఎందుకు?" అనే డైలాగ్ ఉంది. ఆ డైలాగ్ నాకు చాలా నచ్చింది. ఇలాంటి గొప్ప ఆలోచనలను సమాజానికి సినిమాల ద్వారానే బలంగా చెప్పొచ్చు. బిజినెస్‌లో ఎన్నో బాధ్యతలు నిర్వహించిన తర్వాత కూడా నా బకెట్ లిస్ట్‌లో సినిమా రంగంలోకి రావడం ఒక లక్ష్యంగా పెట్టుకున్నాను. నాకు స్ఫూర్తిని ఇచ్చిన అందరితో పని చేయాలని ఈ ప్రయాణం చేస్తున్నాను,

కోవిడ్ సమయంలో సినీ పరిశ్రమలో అడుగుపెట్టారు కదా

–కోవిడ్ చాలా మంది ఇంపాక్ట్ అయ్యారు. ఆ సమయంలో మేము కేవీఎన్ ద్వారా'ఫీడ్ మై సిటీ' కార్యక్రమాన్ని ప్రారంభించాం. కోవిడ్ కారణంగా ఉపాధి కోల్పోయినవారికి, రోజువారీ కూలీలకు భోజనం అందించాం. సుమారు 45 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని కొనసాగించి లక్షలాది మందికి ఆహారం అందించగలిగాం. ఆ సేవా కార్యక్రమం మా జీవితంలో ఎంతో సంతృప్తిని ఇచ్చిన అనుభవంగా నిలిచిపోయింది.

కోవిడ్ సమయంలో సినిమా పరిశ్రమ కూడా తీవ్రంగా నష్టపోయింది. మా చుట్టుపక్కల కూడా సినీ పరిశ్రమకు చెందిన వాళ్లు ఉండేవారు. వాళ్లతో మాట్లాడినప్పుడు ఎన్ని సినిమాలు ఆగిపోయాయో, ఎంతమంది ఉపాధి కోల్పోయారో తెలిసింది. అప్పుడే మనం కూడా ఈ పరిశ్రమకు ఏదైనా చేయాలనే ఆలోచన వచ్చింది. ముందుగా ఫిల్మ్ ఫైనాన్స్, ఆ తర్వాత డిస్ట్రిబ్యూషన్‌లోకి అడుగుపెట్టాం. రాజమౌళి గారి 'ఆర్ఆర్ఆర్' సినిమాను కర్ణాటకలో డిస్ట్రిబ్యూట్ చేశాం. రాజమౌళి గారు, వారి కుటుంబం అంటే నాకు ఎంతో గౌరవం. డిస్ట్రిబ్యూషన్ తర్వాత ప్రొడక్షన్‌లోకి కూడా అడుగుపెట్టాం.

విజయ్ గారితో మీ ప్రయాణం ఎలా మొదలైంది?

ఇది నా తొలి తమిళ సినిమా. విజయ్ గారి మేనేజర్‌తో నాకు ముందే పరిచయం ఉంది. 'లియో' సినిమా సమయంలో మా మధ్య చర్చలు జరిగాయి. గోట్ తర్వాత విజయ్ గారు మరో సినిమా చేయబోతున్నారని తెలిసింది. ఆయన సినిమాలు నాకు చాలా ఇష్టం. అందుకే ఆయన మేనేజర్‌కు నా ఆసక్తిని చెప్పాను. ఒక్క మీటింగ్‌లోనే ఈ సినిమా ఓకే అయింది. అలా విజయ్ గారితో నా ప్రయాణం ప్రారంభమైంది.

'భగవంత్ కేసరి' సినిమాను 'జన నాయకుడు'కు ఇన్‌స్పిరేషన్‌గా తీసుకోవాలనే ఆలోచన ఎవరిది?

'భగవంత్ కేసరి' సినిమా విజయ్ గారికి చాలా నచ్చింది. నాకు కూడా చాలా ఇష్టం. అందులోని రెండు సన్నివేశాలను మాత్రమే ఇన్‌స్పిరేషన్‌గా తీసుకుని, మిగతా కథ మొత్తం కొత్త ప్రపంచంలో సాగేలా రూపొందించాం. ఈ విషయంపై అనిల్ గారితో కూడా మాట్లాడాం. పూర్తిగా కొత్త సబ్జెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతో పని చేశాం. ట్రైలర్‌ను కూడా చాలా నిజాయితీగా కట్ చేశాం. 'భగవంత్ కేసరి'లోని రెండు సన్నివేశాల ప్రభావం ఉందనే విషయాన్ని దాచలేదు. అయితే ట్రైలర్ చూసి ఒక అభిప్రాయం ఏర్పడొచ్చు. కానీ సినిమా చూస్తే పూర్తిగా కొత్త ప్రపంచం, కొత్త కాన్ఫ్లిక్ట్ కనిపిస్తుంది. అమ్మాయిని ఆర్మీలో జాయిన్ చేయాలనే థ్రెడ్ తప్పితే మిగతాదంతా పూర్తిగా కొత్త కథ. ఓపెన్ మైండ్‌తో చూస్తే సినిమా కొత్త అనుభూతిని ఇస్తుంది. ఎమోషనల్‌గా కూడా ప్రేక్షకులతో బలంగా కనెక్ట్ అవుతుంది.

సెన్సార్ విషయంలో చాలా ఇబ్బందులు వచ్చాయి కదా? బాధపడ్డారా?

ఇందులో గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్, సమాజంలో మార్పు తీసుకురావాలనే సందేశం ఉంది. భగవంత్ కేసరికి జాతీయ అవార్డు కూడా అందుకుంది. అలాంటి స్ఫూర్తితో వస్తున్న ఈ సినిమాకు మొదట మా సినిమాకు ఏ/ం సర్టిఫికెట్ ఇచ్చి, తర్వాత ం సర్టిఫికెట్ ఇవ్వడం కొంచెం బాధ కలిగించింది. ఎందుకంటే ఈ సినిమా యువతను ప్రేరేపించేలా, ఆలోచింపజేసేలా ఉంటుంది. ఎక్కువ మంది కుటుంబాలతో కలిసి చూస్తే ఆ సందేశం మరింత మందికి చేరేది. అయితే సెన్సార్ బోర్డు తమ అభిప్రాయం ప్రకారం నిర్ణయం తీసుకుంది.

ఈ సినిమా రిలీజ్ చాలా ఆలస్యమైంది కదా? నిర్మాతగా ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు?

–ఇంత పెద్ద సినిమా అనుకున్న సమయానికి విడుదల కాకపోతే నిర్మాతగా ఎలాంటి ఇబ్బందులు వస్తాయో అవన్నీ సహజంగా వస్తాయి. నిర్మాత ఒక్కరిపైనే కాదు... మొత్తం సినిమా ఎకోసిస్టమ్‌పై దీని ప్రభావం పడుతుంది.

–మన గమ్యం గొప్పగా ఉన్నప్పుడు, ఆ ప్రయాణం కూడా కొన్నిసార్లు కఠినంగానే ఉంటుంది. గొప్ప విజయాలు ఎప్పుడూ సులభంగా రావు. దేవుడు యుధం తర్వాతే కిరీటం ఇస్తాడు. పోరాటాలను దాటిన తర్వాతే విజయం దక్కుతుంది.

ముఖ్యమంత్రి అయిన తర్వాత విజయ్ గారి నుంచి వస్తున్న తొలి సినిమా ఇది. అంచనాలు ఇంకా పెరుగుతాయని భావిస్తున్నారా?

ఖచ్చితంగా. తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విజయ్ గారి సినిమా థియేటర్లలో విడుదల కావడం ప్రేక్షకులకు, అభిమానులకు ఒక ప్రత్యేకమైన అనుభూతి. ఈ తరం ప్రేక్షకులకు ఒక ముఖ్యమంత్రి నటించిన సినిమాను థియేటర్‌లో చూసే అవకాశం రావడం చాలా అరుదు. కచ్చితంగా ఇది ప్రతి ఒక్కరికీ మెమొరబుల్ మూమెంట్ అవుతుంది.

విజయ్ గారు చాలా డిసిప్లిన్ ఉన్న వ్యక్తి. ఆయనతో కలిసి పని చేయడం గొప్ప అనుభవం. అనుకున్న సమయానికి తన పనిని పూర్తి చేస్తారు. ఆయనతో వర్క్ చేయడం నిజంగా ఎంతో ఆనందాన్ని ఇచ్చింది.

ఈ సినిమా విజయ్ గారి అభిమానులకు ఎలాంటి అనుభూతిని ఇస్తుందని భావిస్తున్నారు?

ఈ సినిమా విజయ్ గారి అభిమానులకు కచ్చితంగా ఒక మెమొరబుల్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 7,000 నుంచి 8,000 స్క్రీన్లో సినిమాను విడుదల చేస్తున్నాం. విజయ్ గారి సినీ ప్రయాణానికి ఓ ట్రిబ్యూట్‌లా ఉండేలా ప్లాన్ చేశాం.

విజయ్ గారితో మళ్లీ సినిమా చేసే అవకాశం ఉందా?

ప్రస్తుతం విజయ్ గారి దృష్టంతా ప్రజా సేవపైనే ఉంది. ప్రజల జీవితాలను మెరుగుపరచడానికి ఆయన పూర్తిస్థాయిలో కష్టపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఆయన మళ్లీ సినిమాలు చేసే అవకాశం ఉంటుందని నేను అనుకోవడం లేదు. ఒకవేళ భవిష్యత్తులో అలాంటి అవకాశం వస్తే మాత్రం తప్పకుండా ఆయనతో మరో సినిమా చేయాలని ఉంటుంది.

–చాలా మందిని జీవితంలో కలుస్తాం. కానీ కొందరి వ్యక్తిత్వం మాత్రం ఎప్పటికీ గుర్తుండిపోతుంది. విజయ్ గారు అలాంటి వ్యక్తి.

–ఆయన నాకు ఒక ముఖ్యమైన బాధ్యత కూడా అప్పగించారు. నా అనుభవాన్ని ఉపయోగించి ఆ బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించడానికి ప్రయత్నిస్తున్నాను.

చిరంజీవి గారితో చేస్తున్న సినిమా గురించి?

నాకు చిన్నప్పటి నుంచి చిరంజీవి గారంటే చాలా అభిమానం. ఆయన సినిమాలు, ఆయన ప్రయాణం నాకు స్ఫూర్తి. ముఖ్యంగా ఆయన సినిమాల్లోని పాటలు, సందేశాలు జీవితంలో ముందుకు వెళ్లడానికి ఎంతో ప్రేరణ ఇచ్చాయి. అందుకే నేను తెలుగులో సినిమా చేస్తే మొదట చిరంజీవి గారితోనే చేయాలని ముందే నిర్ణయించుకున్నాను. ఇప్పుడు ఆయనతో సినిమా చేసే అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది. సినిమా చాలా అద్భుతంగా వస్తోంది.

Edited, Printed, Published and Owned by NASREEN KHAN , Printed at M/s DATTASAI GRAPHICS :1-1-651/8, Gandhi Nagar, Hyderabad-500 080
Published from H.No.1-7-137, Flat 402, Vijaysai Apartments, Zamistanpur, Musheerabad, Hyderabad- 20, (Telangana) Editor:Nasreen Khan, Ph : 040-27602786, Cell : 965243981 .R.N.I.No.TELTEL/2013/51844